విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

ప్రశ్నించడం అందరి హక్కు...

# పెన్ సత్తా

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 257 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శుక్రవారం 6 ఫిబ్రవరి 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


# మేఘాలయ బొగ్గు గనిలో పేలుడు.. 18 మంది మృతి



షిల్లాంగ్: మేఘాలయలోని ఓ బొగ్గుగనిలో గురువారం పేలుడు సంభవించడంతో 18 మంది కూలీలు ప్రాణాలు కోల్పోయారు. తూర్పు జయంతియా హిల్స్ జిల్లాలోని థంగ్స్కు ప్రాంతంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. శిథిలాల కింద మరికొందరు కూలీలు చిక్కుకుపోయినట్లుగా తెలుస్తోంది. దీంతో మృతుల సంఖ్య పెరగొచ్చని అధికారులు భావిస్తున్నారు. మృతుల్లో ఎక్కువమంది అస్సాంకు చెందినవారిగా తెలుస్తోంది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ గనిని అక్రమంగా నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున పరిహారం ప్రకటించారు.



## పెళ్లి బృందం బస్సు లోయలో పడి ఎనిమిది మంది మృతి

- ప్రమాద సమయంలో బస్సులో 60 మంది
- మరో 16 మంది పరిస్థితి విషమం
- మరో వాహనంలో రావడంతో వధూవరులు క్షేమం
- పెళ్లి వేడుక ముగించుకుని వస్తుండగా ఘటన

మిగతా2లో

# వెంకన్నకు మకిలి అంటించే మహాకుట్ర

దేవదేవుడైన వెంకన్న సన్నిధిలో వైకాపా నాయకులు ఘోరమైన అపచారాలు చేశారు. చేసిన దుర్మార్గాలన్నీ బయటపడే సరికి వాటిని అడ్డ గోలుగా సమర్థించు కోవడమే కాకుండా, బూతులతో ఎదురుదాడి చేస్తున్నారు. చంద్రబాబు

- సొంత మనిషి ధర్మారెడ్డి ద్వారా జగన్ అమలు చేశారు
- తితిదేకి కల్తీ నెయ్యి సరఫరా దానిలో భాగమే
- సీఎం చంద్రబాబు ధ్వజం
- మహాపచారానికి పాల్పడ్డవారిని కఠినంగా శిక్షిస్తామని వెల్లడి



వైకాపా ప్రభుత్వ హయాంలో తితిదేకి కల్తీ నెయ్యి సరఫరా వేంకటేశ్వరస్వామిని అపవిత్రం చేసేందుకు పన్నిన భారీ కుట్రలో భాగమని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. అది ఉద్దేశపూర్వకంగా మీరు పంపించిన ఈవో (ధర్మారెడ్డి) ద్వారా అమలు చేసిన మహాకుట్ర.. అని మాజీ సీఎం జగన్‌ను ఉద్దేశించి మండిపడ్డారు. 'అది కేవలం డబ్బు కక్కుర్తితో చేసింది కాదు. ఏదో ఒకసారి తప్పు జరిగితేనో, కిందిస్థాయి ఉద్యోగులెవరైనా చేస్తేనో క్షమించొచ్చు. కానీ కల్తీ నెయ్యి వ్యవహారం తిరుమల ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఆయన (జగన్) మనుషుల ద్వారా అమలు చేసిన పన్నాగం' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్తీనెయ్యి కుంభకోణం తితిదే అప్పటి ఛైర్మన్ (వైవీ సుబ్బారెడ్డి)కి తెలిసే జరిగిందన్నారు. అప్పట్లో ఛైర్మన్, బోర్డు సభ్యులు కూర్చుని టెండర్ నిబంధనల్ని అడ్డగోలుగా మార్చేశారని, కొనుగోళ్ల కమిటీలో

మిగతా2లో



# అన్నీ ఆలోచించాకే మాట్లాడాం

- నెయ్యి కల్తీ.. పక్కా ఆన్ రికార్డ్
- గొడ్డు, పందికొవ్వు ఉందని ఎన్‌డీడీబీ నివేదికలో ఉంది
- మరి వైకాపా నేతలకు క్లీన్‌చిట్ ఇచ్చిందెక్కడ?
- ఈ కుంభకోణంతో ప్రమేయమున్న ఎవరినీ వదిలిపెట్టం
- సున్నితమైన అంశమని తెలిసినా, ప్రజల ముందుకు తెచ్చాం
- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

'పాలు వాడకుండా తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి ఆవునెయ్యి అంటూ 59.70 లక్షల కిలోలు సరఫరా చేశారు. దీని తయారీకి 58 లక్షల కిలోల పామోలిన్, పామ్‌కెర్నల్ ఆయిల్స్, సుమారు 1.70 లక్షల కిలోల రసాయనాలు వాడారు. ఇవన్నీ ఆన్‌రికార్డ్. సిట్ ఆధారాలు కూడా సేకరించింది. మరి కల్తీయే లేదని క్లీన్‌చిట్ ఇచ్చిందెక్కడ?' ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

మిగతా2లో



## జగన్ కు విజయవాడ పోలీసుల నోటీసులు!

- మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటికి వైఎస్ జగన్
- విజయవాడలో రూట్ మార్చాలంటూ పోలీసులు నోటీసులు జారీ
- అంబటి పర్యటనకు వచ్చిన జనాన్ని చూసి ప్రభుత్వం కుట్ర చేస్తోందని వైసీపీ ఆరోపణ
- ముందే రూట్ మ్యాప్ ఇచ్చినా ఆంక్షలు విధించారంటూ ఆగ్రహం

మిగతా2లో

# విపక్షాల పై నిప్పులు చెరిగిన మోడీ

## విదేశీ డీల్స్ పై వివరణ-విపక్షం వాకౌట్..!




- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో ప్రధాని ప్రసంగం
- మాజీ ఆర్మీ చీఫ్ నరవణే పుస్తకంపై చర్చకు పట్టుబట్టిన విపక్షాలు
- ప్రధాని మాట్లాడుతుండగా నినాదాలు.. సభ నుంచి వాకౌట్ చేసిన విపక్ష సభ్యులు
- వికసిత భారత్ లక్ష్యంగా దేశం ముందుకు సాగుతోందన్న ప్రధాని మోదీ
- భారత్‌తో వ్యాపారానికి ప్రపంచ దేశాలు ఆసక్తి చూపుతున్నాయని వ్యాఖ్య

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 05: విపక్షాలతో పాటు గతంలో ప్రధానులుగా పనిచేసిన వాళ్ల తప్పిదాల్ని సరిచేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ గురువారం రాజ్యసభలో వెల్లడించారు. నిన్న లోక్ సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ ని మాట్లాడ నివ్వకుండా అడ్డుకున్నందుకు నిరసనగా ఇవాళ ప్రధాని ప్రసంగాన్ని

మిగతా2లో



## లోక్‌సభలో ప్రధాని మోదీపై దాడికి కుట్ర..?

- లోక్ సభలో ప్రధాని మోదీపై దాడికి కాంగ్రెస్ ప్లాన్: పార్లమెంటు వర్గాలు!
- అందుకే ప్రధాని ప్రసంగం లేకుండానే తీర్మానం
- మోదీ మాట్లాడే సమయంలో దాడి చేసేందుకు ప్లాన్ చేసినట్లు సమాచారం వచ్చిందన్న లోక్ సభ వర్గాలు
- అందుకే మహిళా ఎంపీలను పంపించారని వెల్లడి

గతంలో ఎన్నడూ లేని విధంగా, గురువారం ప్రధానమంత్రి ప్రసంగం లేకుండానే రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని లోక్ సభ ఆమోదించింది. అయితే ప్రధాని మోదీపై దాడికి ప్లాన్ జరిగినట్లుగా జాతీయ

మిగతా2లో

# ప్రతి ఎకరాకూ నీరివ్వాలి

## కాలువలు, డ్రెయిన్ల నిర్వహణ, వారబందీ మీ బాధ్యతే

## సాగునీటి సంఘాల అధ్యక్షుల, ఉపాధ్యక్షుల సదస్సులో సీఎం చంద్రబాబు



రాష్ట్రంలోని ప్రతి ఎకరాకూ నీరిచ్చేలా సాగునీటి సంఘాల ప్రతినిధులు కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. కాలువలు, డ్రెయిన్ల నిర్వహణ, వారబందీ బాధ్యత సాగునీటి సంఘాలదేనన్నారు. నీటి తీరువా కూడా వసూలు చేసి, ఆ నిధులు మీరే ఖర్చు చేస్తే జలవనరులు మరింత బాగుపడతాయని పేర్కొన్నారు. సాగునీటి సంఘాల సైన్యం తలుచుకుంటే రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయగలరన్నారు. అమరావతి రాజధానిలోని పరేడ్ మైదానంలో గురువారం రాష్ట్రంలోని సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో సీఎం మాట్లాడారు.

'రాష్ట్రంలో ప్రతి సాగునీటి సంఘానికి రూ.10 లక్షల వరకు నామినేషన్‌పై పనులు చేసుకునే వీలు కల్పించాం. సంఘాలు ఉత్సాహంగా పనులు చేస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.344 కోట్లతో 7,197 నిర్వహణ పనులు చేశారు. ఈ పనులు చేయడం వల్ల మీకు జీఎస్టీ ఇబ్బందులు, పెన్షన్ ఇబ్బందులు వస్తున్నాయని తెలిసింది. వాటన్నింటినీ తొలగిస్తాం' అని సీఎం ప్రకటించారు. మే 15 నాటికే ఖరీఫ్ సాగులో నారుమళ్లకు నీళ్లిస్తామని, ఆ తర్వాత జూన్ నాటికి పొలాలు సాగు చేసుకుందామని చెప్పారు. తుపాన్ల వల్ల ఇబ్బందులు రాకుండా ఖరీఫ్ త్వరగా పూర్తి చేసుకుని రబీ పనులకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 'సాగునీటి సంఘాల ప్రతినిధులు ఇంజినీర్లలా ఆలోచించి కొత్త ఆలోచనలతో ముందుకు

మిగతా2లో

# వెంకన్నకు మకిలి అంటించే మహాకుట్ర

-మొదటిపేజీ తరువాయి

వాళ్ల మనుషుల్ని పెట్టుకుని అరాచకాలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు.కల్తీ నెయ్యి సరఫరా చేసిన డెయిరీలు అప్పటి ఛైర్మన్ పీఏకి రూ.4.68 కోట్లు కమీషన్ ముట్టజెప్పాయని సిట్ తేల్చిందన్నారు. కల్తీ నెయ్యి సరఫరాకు సంబంధించిన అన్ని పత్రాలు, ఆధారాలు, సిట్ ఛార్జిషీట్ ప్రజల ముందు పెడతామని, వారు దానిపై చర్చించాలన్నారు. గురువారం ఉండవల్లిలోని నివాసంలో ఎన్డీయే మిత్రపక్షాల నేతలతో సమావేశం అనంతరం చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రులు లోకేశ్, పయ్యావుల కేశవ్, ఆనం రామనారాయణరెడ్డి, పార్థసారథి, సత్యకుమార్ యాదవ్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావులతో కలసి విలేకర్లతో మాట్లాడారు. 'వైకాపా నాయకులకు దేవుడిపై నమ్మకం లేకపోతే ఆ జోలికి రాకూడదు. అంతే తప్ప భక్తుల మనోభావాల్ని, దేవుడి పవిత్రతను దెబ్బతీయాలనుకోవడం దుర్మార్గం. దేవదేవుడైన వెంకన్న సన్నిధిలో వైకాపా నాయకులు ఘోరమైన అపచారాలు చేశారు. పరకామణిలో దొంగతనం జరిగితే దొంగను శిక్షించకుండా సెటిల్మెంట్ చేశారు. చేసిన దుర్మార్గాలన్నీ బయటపడేసరికి వాటిని అడ్డగోలుగా సమర్థించుకోవడమే కాకుండా, బూతులతో ఎదురుదాడి చేస్తున్నారు. ఇంత మహాపాపానికి ఒడిగట్టినవారికి ఎలాంటి శిక్ష వేయాలో దేవుడే నిర్ణయిస్తాడు' అని పేర్కొన్నారు.

సీఎం క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో పయ్యావుల కేశవ్, పల్లా శ్రీనివాసరావు, పీవీఎన్ మాధవ్, పవన్ కల్యాణ్, లోకేశ్, సత్యకుమార్, ఆనం రామనారాయణరెడ్డి, కొలుసు పార్థసారథి

జంతుకొవ్వు కలిసే అవకాశాలు ఉన్నాయని ఎన్డీడీబీ చెప్పిందితితిదేకి సరఫరా చేసిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలవలేదని సిట్ తేల్చేసిందని జగన్ అంటున్నారు కదా? అన్న ప్రశ్నకు 'జంతువుల కొవ్వు లేదని ఎక్కడుంది? ఆయనకెవరైనా రహస్యంగా చెప్పారా? రాత్రి ఏమైనా కలొచ్చిందా' అని సీఎం మండిపడ్డారు. నెయ్యిలో కల్తీ జరగలేదని సిట్ రిపోర్టులో ఎక్కడా చెప్పలేదన్నారు. జంతువుల కొవ్వు కలిసేందుకు అవకాశముందని ఎన్డీడీబీ నివేదిక చాలా స్పష్టంగా పేర్కొందని తెలిపారు. కర్నాల్‌లోని ఎన్డీఆర్ఐ ల్యాబ్ కూడా ఆ నెయ్యిలో జంతుకొవ్వులు కలిసేందుకు ఉన్న అవకాశాన్ని తోసిపుచ్చలేమని, ఆ పరీక్షలు చేసే టెక్నాలజీ తమ దగ్గర లేదని చెప్పిందని గుర్తుచేశారు.వైకాపా హయాంలో శ్రీశైలంలో కూడా ప్రసాదాలకు కల్తీ నెయ్యి వాడారని వార్తలొస్తున్నాయి కదా అని విలేకర్లు ప్రశ్నించగా.. వైకాపా హయాంలో 10 దేవాలయాల్లో ఇలా అపవిత్రం చేశారన్నారు. కరడుగట్టిన నేరస్థుల మాదిరిగా జగన్ అబద్ధాలతో నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. రసాయనాలతోనే నెయ్యి తయారుచేశారని, అందులో నెయ్యే లేదని సిట్ తేల్చింది కదా, ఈ మహాపాపానికి మీరు లెంపలేసుకుని దేవుడికి క్షమాపణ చెప్పక్కర్లేదా అని ప్రశ్నించారు.

**నివేదికను ఎందుకు తొక్కిపెట్టారు?**

'నెయ్యిలో కల్తీ జరిగిందని 2022లో వైకాపా ప్రభుత్వ హయాంలోనే మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐ ల్యాబ్ నిర్ధారించింది. ఆ రోజే కల్తీ నివారణకు చర్యలు తీసుకుని ఉండొచ్చు. కానీ వారు కల్తీ నెయ్యితో ప్రసాదాలు తయారు చేయాలనుకున్నారు కాబట్టే ఆ నివేదికను తొక్కిపెట్టారు. రాబోయే రోజుల్లో సిట్ రిపోర్టుల్లో మరిన్ని విషయాలు బయటకు వస్తాయి' అని సీఎం పేర్కొన్నారు.

**వేంకటేశ్వరస్వామే మాకీ బాధ్యత అప్పగించారు**

తిరుమల పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ఆ వేంకటేశ్వరస్వామే తమకు అప్పగించారని, ఈ విషయమై ఈ రోజు తాను, పవన్ కల్యాణ్, మాధవ్ కూర్చుని భవిష్యత్ కార్యాచరణపై చర్చించామని చంద్రబాబు చెప్పారు. కల్తీ నెయ్యిపై భాజపా ఎందుకు గట్టిగా మాట్లాడటం లేదని విలేకర్ల ప్రశ్నకు మాట్లాడకపోవడం ఏమీ లేదని.. మిగతా మంత్రులతో కలసి మంత్రి సత్యకుమార్ యాదవ్ విలేకర్ల మావేశంలో మాట్లాడారని సీఎం తెలిపారు.

**ఏకసభ్య కమిటీ సిఫారసుల ఆధారంగా చర్యలు**

'తాము దేవుడి పవిత్రతను కూడా కాపాడలేని అసమర్థులం కాదని, వైకాపా దాడి చేసినా దులిపేసుకోవడానికో, పారిపోవడానికో సిద్ధంగా లేమని చంద్రబాబు స్పష్టం చేశారు. తిరుమలలో మరోసారి అలాంటి అపచారం జరగకుండా అన్ని చర్యలూ తీసుకుంటామన్నారు. కల్తీ నెయ్యి కుంభకోణంలో దోషుల్ని శిక్షిస్తామన్నారు. 'బాధ్యులైన అధికారులపై పాలనాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిట్ నివేదిక పంపింది. ఏకసభ్య కమిటీని నియమించి, ఎక్కడెక్కడ లోపాలు జరిగాయో విశ్లేషించి, చర్యలు ప్రారంభిస్తాం' అని తెలిపారు. అసలు సూత్రధారులెవరో సిట్ నిగ్గు తేల్చలేదు కదా అన్న ప్రశ్నకు.. 'దర్యాప్తు సంస్థలు కొన్ని విషయాలు బయటపెడతాయి. కోర్టులో అదనపు సమాచారం ఫైల్ చేయొచ్చు. అవసరమైన అన్ని మార్గాలూ పరిశీలిస్తాం. దోషులు తప్పించుకోకుండా చూస్తాం' అని తెలిపారు.

# ప్రతి ఎకరాకూ నీరివ్వాలి

-మొదటిపేజీ తరువాయి

రావాలి. రూ.10 లక్షలు ఇస్తే రూ.12 లక్షల పని చేసేలా ఉండాలి. ఒకప్పుడు రైతుల ఆత్మహత్యలకు కేంద్రంగా ఉన్న రాష్ట్రాన్ని రైతు సానుకూలాంధ్రప్రదేశ్‌గా మారుస్తున్నాం' సీఎం పేర్కొన్నారు. ఆయన ప్రసంగంలో ముఖ్యాంశాలివీ..

సాగునీటి సంఘాల రాష్ట్ర సదస్సులో ఆళ్ల గోపాలకృష్ణను సన్మానించి, మంత్రి కందుల దుర్గేష్‌తో కలిసి జ్ఞాపిక అందజేస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్లు వెంకటరమణారెడ్డి, నిరంజన్, మంత్రి అచ్చెన్నాయుడు, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రి నిమ్మల రామానాయుడు

**పోలవరం- నల్లమలసాగర్‌కు అభ్యంతరమేంటి?**

గోదావరి నుంచి ఏటా సగటున 2000 టీఎంసీల నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయి. పోలవరం నుంచి 200 టీఎంసీలు నల్లమలసాగర్‌కు తీసుకువచ్చి అనుసంధానం చేస్తే రాష్ట్రంలో కరవు అనేది ఉండదు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ గోదావరిపై ఎగువన కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది. అక్కడున్నదీ తెలుగువారే కదా అని మనం దానికి అభ్యంతరం చెప్పలేదు. అలాగే పోలవరం నుంచి నల్లమలసాగర్ అనుసంధానానికి ఎవరూ అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదు. సముద్రంలోకి వెళ్లే నీళ్లే తీసుకుంటున్నాం.

**డయాఫ్రం వాల్ విధ్వంసంతో రూ.1,000 కోట్లు వృథా**

రాష్ట్రంలో ప్రాజెక్టులు పూర్తి చేసే క్రమంలో సమస్యల్ని పరిష్కరిస్తాం. గోదావరి పుష్కరాల కన్నా ముందే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తాం. జగన్ హయాంలో పోలవరం ప్రాజెక్టును భ్రష్టు పట్టించారు. రూ.440 కోట్లతో మనం కట్టిన డయాఫ్రం వాల్‌ను జగన్ పట్టించుకోపోవడంతో అది సర్వనాశనమయింది. దీంతో రూ.వెయ్యి కోట్లు పెట్టి మళ్లీ డయాఫ్రం వాల్ కట్టాల్సి వచ్చింది. దీంతోపాటు ప్రాజెక్టూ ఆలస్యమయింది. 2014-19 మధ్య సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.68 వేల కోట్లు ఖర్చు చేశాం. ఆ ఫలితాలే ఇప్పుడు వస్తున్నాయి.

**రాయలసీమ ఎత్తిపోతల వైకాపా ప్రభుత్వంలోనే ఆగింది**

రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టును జగన్ ప్రభుత్వం ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తుంటే జాతీయ హరిత ట్రైబ్యునల్ నిలిపివేసింది. దాన్ని మన ప్రభుత్వం ఆపేసినట్లు వాళ్లు దుష్ప్రచారం చేస్తున్నారు. శ్రీశైలం జలాశయంలో అత్యంత దిగువ నుంచి నీళ్లు ఎత్తిపోసేలా ముచ్చుమర్రి ఉంది. దాని నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా సీమ జలాశయాలన్నింటికీ నీళ్లు తీసుకువెళ్లవచ్చు. రాష్ట్రంలోని అన్ని

జలాశయాలు 91%, చెరువులు 65% నిండాయి. అన్ని జలాశయాల్లో కలిపి 846 టీఎంసీల నీళ్లు నిల్వ ఉన్నాయి. ఏడాదికి మనకు 1,300 టీఎంసీలు సరిపోతాయి. ఈ ఏడాది కోస్తాలో కన్నా రాయలసీమలోనే ఎక్కువ వర్షాలు పడ్డాయి. భూగర్భజలాలు కూడా రాయలసీమలోనే ఎగువకు ఉన్నాయి. ఒకప్పుడు ఎడారిగా మారిపోతుందన్న అనంతపురం జిల్లాను మనం పండ్ల తోటల వనంగా మార్చాం. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తోంది. బియ్యం తినేవాళ్లు తగ్గిపోతున్నారు. అందువల్ల చిరుధాన్యాలు, పండ్ల తోటలు పెంచాలి. వీటి వల్ల ఆరోగ్యంతోపాటు ఆదాయమూ పెరుగుతుంది. ప్రకృతిసేద్యానికి జియో ట్యాగింగ్ చేసి సర్టిఫికేషన్ చేస్తాం.

# అన్నీ ఆలోచించాకే మాట్లాడాం

-మొదటిపేజీ తరువాయి

తిరుమలలో శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరాలో ప్రమేయమున్న ఎవరినీ వదిలిపెట్టబోమని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హెచ్చరించారు. వారంతా స్వామివారి ముందు మోకరిల్లి తమ తప్పులకు క్షమాపణ కోరేవరకు యుద్ధం కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఏడుకొండల వాడికి రెండు కొండలు చాలనే ఆలోచనా ధోరణి నుంచి వైకాపా నాయకులు పుట్టారని, వారు ఏ స్థాయికైనా దిగజారతారని దుయ్యబట్టారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. 'సీబీఐ ఛార్జిషీట్ రావడానికి సమయం పట్టవచ్చు. దోషులను వదలిపెట్టం. తప్పులు చేసి ఏమీ జరగలేదని బుకాయిస్తున్నారు. హిందువుల విశ్వాసాల్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారు' అని పవన్ పేర్కొన్నారు.

అన్నీ ఆలోచించాకే మాట్లాడాం

'మతం, విశ్వాసం, ధర్మం చాలా లోతైనవి. వాటి విషయంలో స్పందిస్తే పర్యవసానాలు ఎలా ఉంటాయో ఆలోచించాకే మాట్లాడాలి. శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారని తెలిశాక, దాన్ని ప్రజలకు చెప్పకపోతే తప్పే అవుతుంది. ఇటీవల ఎన్డీయే ఎమ్మెల్యేల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్డీడీబీ నివేదిక చదివి విన్పించారు. నెయ్యి నమూనాల్లో వెజిటబుల్ ఆయిల్స్, ఫిష్ ఆయిల్‌తో పాటు గొడ్డు, పందికొవ్వు కలిసినట్లు నివేదికలో ఉంది. ఇది సున్నితమైన అంశం కావడంతో బయటకు చెప్పాలా, వద్దా అని ఆలోచించాం. కల్తీ నెయ్యిపై కళ్లముందు నివేదికలున్నా మేం మాట్లాడకపోతే.. అందరికీ తెలిసీ ఎందుకు చెప్పలేదనే ప్రశ్నలు ఎదుర్కోవాలి. కొందరు దీన్ని కూడా అనుకూలంగా మలచుకునేందుకు, రాజకీయ లబ్ధికి ప్రయత్నిస్తారని తెలుసు. అన్నీ ఆలోచించాకే కల్తీ వ్యవహారాన్ని బయటపెట్టామ'ని పవన్ వివరించారు. 'ఎన్నికలకు ముందు ఆరు నెలలంటే రాజకీయ లబ్ధికి అనుకోవచ్చు. ఐదేళ్లూ మేమే అధికారంలో ఉంటాం. ఇప్పుడు దీనివల్ల రాజకీయంగా వచ్చేది ఏముంటుంది' అని ప్రశ్నించారు.

నెయ్యే లేదని సీబీఐ స్పష్టంగా చెప్పింది

సరఫరా చేసిన పదార్థంలో నెయ్యి అనేదే లేదని, దానితోనే లడ్డూలు తయారు చేశారని సిట్ స్పష్టంగా చెప్పిందని పవన్‌కల్యాణ్ గుర్తుచేశారు. అయినా నెయ్యిలో కల్తీయే లేదని క్లీన్‌చిట్ ఇచ్చిందంటూ వైకాపా నేతలు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. నెయ్యి నమూనాల్లో పంది, గొడ్డుకొవ్వు, ఫిష్ ఆయిల్ ఉండే అవకాశాలున్నాయని ఎన్డీడీబీ సీఏఎల్ఎఫ్ ల్యాబ్ స్పష్టంగా చెప్పిందని గుర్తుచేశారు. 'అసలు దీన్ని నెయ్యి అనకూడదు. పామోలిన్ అనాలి. దానితోనే కోట్ల కొద్దీ లడ్డూలు చేశారు. తెలిసీ తప్పు చేసి, తిరిగి మాపైనే ఎదురుదాడి చేస్తున్నారు. మమ్మల్నే క్షమాపణ చెప్పాలనడమేంట'ని పవన్ ఆగ్రహించారు. 2022లోనే నెయ్యి కల్తీపై నివేదిక వచ్చిందని, నాటి ఛైర్మన్, అధికారులు దాన్ని ఎందుకు తొక్కిపెట్టారో చెప్పాలని డిమాండ్‌చేశారు. కల్తీ నెయ్యి అని తెలిసీ ఆ లడ్డూలు అయోధ్యకు పంపారని చెప్పారు.

**వైకాపా వారసత్వమేంటో చూడండి**

వైకాపా వారసత్వం ఎలాంటిదో ప్రజలు తెలుసుకోవాలని పవన్‌కల్యాణ్ కోరారు. 'రామతీర్థంలో శ్రీరాముడి విగ్రహ శిరచ్ఛేదం చేసినా, అంతర్వేదిలో రథం కాలినా ఆకతాయి చేష్టగా కొట్టిపారేశారు.

దుర్గగుడిలో వెండి విగ్రహాలు చోరీ అయితే.. వాటితో మేడలు, మిద్దెలు కడతామా అన్నారు. వైకాపా పాలనలో రాష్ట్రవ్యాప్తంగా 219 చోట్ల ఇలాంటి ఘటనలు జరిగాయి' అని గుర్తుచేశారు. '2019లో బహిరంగ మార్కెట్లో నెయ్యి ధర కిలో రూ.420 ఉండేది. 2020 నాటికి రూ.500కు పెరిగింది. అలాంటిది రూ.319, రూ.329కి కిలో చొప్పున ఎలా సరఫరా చేశారు? ఇంట్లోని మహిళల్ని అడిగినా ఇది కల్తీ నెయ్యి అనే చెబుతారు. బుకాయించినంత మాత్రాన తప్పులు దాచలేరు' అని పవన్ ఆగ్రహించారు. కల్తీ నెయ్యి పంపిన భోలేబాబా, ఇతర డెయిరీలు హిందువులకే చెందినవని, ఇది మతాల వ్యవహారం కాదని వ్యాఖ్యానించారు. ఇందులో ఇస్లాం, క్రిస్టియన్ ఇతర మతాలకు సంబంధం లేదని, వారి విశ్వాసాల్ని కించపరచడం లేదని పవన్ వివరించారు.

# లోక్‌సభలో ప్రధాని మోదీపై దాడికి కుట్ర..?

-మొదటిపేజీ తరువాయి

మీడియాలో వార్తలు వస్తున్నాయి. లోక్ సభలో ప్రధాని మోదీ మాట్లాడే సమయంలో ఆయనను చుట్టుముట్టి దాడి చేసేందుకు కాంగ్రెస్ ప్లాన్ చేసినట్లు సమాచారం రావడంతోనే సభను వాయిదా వేసినట్లు లోక్ సభ వర్గాలు వెల్లడించాయి.దాంతో ప్రధాని ప్రసంగం లేకుండానే రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని లోక్ సభ గురువారం ఆమోదించింది.

ఈ తీర్మానంపై ప్రధాని మోదీ మాట్లాడకపోవడం అరుదైన అంశమని, ఈ సభలో మోదీని చుట్టుముట్టి దాడి చేసేందుకు ప్రధాన ప్రతిపక్షం ప్లాన్ చేసినట్లు సమాచారం వచ్చిందని లోక్ సభ వర్గాలు వెల్లడించినట్లు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. అందుకోసమే మహిళా ఎంపీలను పంపించారనిద పేర్కొంది. ప్రసంగించేందుకు మోదీ అందుబాటులో ఉన్నప్పటికీ ఈ సమాచారంతో బుధవారం సభను వాయిదా వేయాలని స్పీకర్ నిర్ణయించారని తెలిపింది.

## విపక్షాల పై నిప్పులు చెరిగిన మోడీ

-మొదటిపేజీ తరువాయి

అడ్డుకునేందుకు విపక్షాలు ప్రయత్నించాయి. రాష్ట్రపతి ప్రసంగం పై ధన్యవాదాలు తెలిపే తీర్మానం పై చర్చకు ముగింపు పలుకుతూ ప్రధాని కీలక ప్రసంగం చేశారు. ఓ వైపు తాను ప్రసంగం చేస్తున్నా నిలబడి నినాదాలు చేస్తున్న విపక్ష నేత మల్లిఖార్జున ఖర్గేను ఉద్దేశించి మీ వయస్సు ప్రకారం మీరు కూర్చుని నినాదాలు చేయవచ్చని ప్రధాని మోదీ చురకలు అంటించారు. అనంతరం అభివృద్ధి చెందిన దేశాలకు వృధ్యాప్యం వస్తుంటే, మన దేశానికి మాత్రం యవ్వనం వస్తోందన్నారు. ప్రపంచంలో అత్యంత ముఖ్య మైన ప్రతిభావంతు లైన సమూహాలలో మనదీ ఒకటన్నారు. ప్రపంచ సంఘర్షణల సమయంలో భారతదేశం ఒక ఆశాకిరణంగా నిలుస్తోందన్నారు. భారతదేశం అధిక వృద్ధి, తక్కువ ద్రవ్యోల్బణం యొక్క ప్రత్యేక కలయికను కలిగి ఉందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ప్రపంచం మొత్తం ప్రపంచ దక్షిణాది గురించి మాట్లాడుతుందని, భారత్ ప్రపంచ దక్షిణాదికి స్వరంగా మారిందన్నారు. గతంలో భారత్ తో ఒప్పందాలు చేసుకోవడానికి ఏ దేశం సిద్ధంగా లేదని, కానీ ఇవాళ యూరప్, అమెరికా ఒప్పందాలు చేసుకున్నాయని గుర్తుచేశారు. తన మాటల్ని నమ్మకపోతే గతంలో ఎర్రకోట వద్ద ప్రధానులు చేసిన ప్రసంగాలను పరిశీలించాలన్నారు. భారతదేశం అధిక వృద్ధి, తక్కువ ద్రవ్యోల్బణం యొక్క ప్రత్యేక కలయికను కలిగి ఉందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ప్రపంచం మొత్తం ప్రపంచ దక్షిణాది గురించి మాట్లాడుతుందని, భారత్ ప్రపంచ దక్షిణాదికి స్వరంగా మారిందన్నారు. గతంలో భారత్ తో ఒప్పందాలు చేసుకోవడానికి ఏ దేశం సిద్ధంగా లేదని, కానీ ఇవాళ యూరప్, అమెరికా ఒప్పందాలు చేసుకున్నాయని గుర్తుచేశారు. తన మాటల్ని నమ్మకపోతే గతంలో ఎర్రకోట వద్ద ప్రధానులు చేసిన ప్రసంగాలను పరిశీలించాలన్నారు. వారికి ఎటువంటి ఆలోచన, దార్శనికత, ప్రణాళిక లేదనేదనేది అర్థమవుతోందనంటూ ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. వారి చెత్తను శుభ్రం చేయడమే తన పని అని ప్రధాని మోదీ అన్నారు. ప్రస్తుతం భారత్ సంస్కరణల దిశగా పయనిస్తోందని, మన దేశంతో ఒప్పందాలు కుదుర్చు కోవడానికి ప్రపంచం ఆసక్తిగా ఉందని తెలిపారు. అమెరికా వాణిజ్య ఒప్పందం తర్వాత, ప్రపంచం స్థిరత్వంతో పాటు మన వేగాన్ని కూడా గుర్తిస్తుందన్నారు. ఈ ఒప్పందం యువతకు ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. ప్రపంచ మార్కెట్ వారి కోసం తెరిచామన్నారు.

## పెళ్లి బృందం బస్సు లోయలో పడి ఎనిమిది మంది మృతి

వధూవరుల నూతన జీవితం ప్రారంభం కావాల్సిన వేళ, ఒక ఘోర రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాల్లో తీరని చీకట్లు నింపింది. నేపాల్‌లోని బైతాడి జిల్లాలో గురువారం రాత్రి జరిగిన బస్సు ప్రమాదంలో ఎనిమిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పెళ్లి వేడుక ముగించుకుని తిరిగి వస్తుండగా, బైతాడి జిల్లాలోని పుర్చౌడి మున్సిపాలిటీ పరిధిలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.సుమారు 60 మందితో వెళ్తున్న ఈ బస్సు కొండ ప్రాంతంలోని వంకర మార్గంలో ప్రయాణిస్తూ నియంత్రణ కోల్పోయి లోయలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో 45 మందికి పైగా గాయపడగా, వారిలో 16 మంది పరిస్థితి విషమంగా ఉంది. వీరందరినీ సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. అయితే, వధూవరులు వేరే వాహనంలో ప్రయాణిస్తుండటంతో వారు సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే నేపాల్ సైన్యం, పోలీసులు, స్థానికులు గాలింపు చర్యలు చేపట్టి క్షతగాత్రులను బయటకు తీశారు.నేపాల్‌లో ఇటీవలి కాలంలో రోడ్డు ప్రమాదాలు ఆందోళనకరంగా పెరుగుతున్నాయి. పదేళ్ల క్రితం ఏడాదికి సుమారు 5 వేల ప్రమాదాలు నమోదవ్వగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆ సంఖ్య 7,669కి చేరడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. కేవలం గడిచిన ఏడాదిలోనే 190 మంది ఈ రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రాణాలు కోల్పోయారు.ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం.. నేపాల్‌లో జరుగుతున్న ఈ రోడ్డు ప్రమాదాల వల్ల దేశ స్థూల జాతీయోత్పత్తిలో 1.5 శాతం నష్టం వాటిల్లుతోంది. మృతుల్లో 70 శాతం మంది పాదచారులు, ద్విచక్ర వాహనదారులే ఉండటం గమనార్హం. రోడ్ల అనుసంధానత పెరుగుతున్నా, భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, డ్రైవర్ల అజాగ్రత్తే ఈ మరణాలకు ప్రధాన కారణమని అధికారులు విశ్లేషిస్తున్నారు.

## జగన్ కు విజయవాడ పోలీసుల నోటీసులు!

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ విజయవాడ పర్యటనపై పోలీసులు ఆంక్షలు విధించారు. రేపు మాజీ మంత్రి జోగి రమేశ్ కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ సిద్ధమవుతున్న తరుణంలో, పర్యటన మార్గాన్ని మార్చాలని విజయవాడ పోలీసులు నోటీసులు జారీ చేశారు.వివరాల్లోకి వెళితే, జగన్ శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని జోగి రమేశ్ నివాసానికి వెళ్లాల్సి ఉంది. ఇందుకోసం తాడేపల్లి నుంచి కనకదుర్గ వారధి, ఫ్లైఓవర్ మీదుగా వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అయితే, పర్యటనకు ఒక రోజు ముందు విజయవాడ నగర పోలీస్ కమిషనర్ స్వయంగా ఈ మార్గంలో వెళ్లవద్దని, వేరే దారిలో వెళ్లాలని సూచిస్తూ నోటీసులు ఇచ్చినట్టు తెలుస్తోంది.ఇటీవల గుంటూరులో మాజీ మంత్రి అంబటి రాంబాబును పరామర్శించేందుకు జగన్ వెళ్లినప్పుడు భారీగా జనం తరలివచ్చారని, ఈ ప్రజా స్పందన చూసి కూటమి ప్రభుత్వం భయపడిందని వైసీపీ నేతలు అంటున్నారు. అందుకే ఇప్పుడు విజయవాడ పర్యటనను అడ్డుకునేందుకు కుట్రపూరితంగా ఆంక్షలు విధిస్తోందని వైఎస్సార్సీపీ వర్గాలు తీవ్రంగా ఆరోపిస్తున్నాయి. ముందస్తుగా సమాచారం ఇచ్చినా చివరి నిమిషంలో పోలీసులు మార్గాన్ని మార్చమంటున్నారని పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# పర్యాటక రంగ బ్రాండింగ్, మార్కెటింగ్ కోసం రూ.150 కోట్ల ప్రతిపాదన



**విజయవాడ, పెన్ సత్తా, ఫిబ్రవరి 05:** 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో, పర్యాటక రంగ అభివృద్ధి, నిధుల కేటాయింపుల పై వెలగపూడి సెక్రటేరియట్ లో కీలక సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, శాఖాధిపతులు భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని పరుగులు పెట్టించేందుకు అవసర మైన నిధుల పై ఈ సమావేశంలో చర్చించారు. రాష్ట్ర పర్యాటక రంగానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్, మార్కెటింగ్ కల్పించడంతో పాటు వివిధ పర్యాటక ఉత్సవాల నిర్వహణకు రూ. 150 కోట్లు కేటాయించాలని మంత్రి దుర్గేష్ ఆర్థిక మంత్రిని కోరారు. విశాఖపట్నం, తిరుపతి నగరాలను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక తోడ్పాటు అందించాలని చర్చించారు. అదే విధంగా అన్ని జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. ఇందుకు ఆర్థిక సహకారం కావాలని కోరారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రసాద్, స్వదేశీ దర్శన్ 2.0, సీబీడీడీ, శాస్కి మరియు పూర్వోదయ పథకాల ద్వారా వచ్చే నిధులను సమర్థవంతంగా వినియోగించుకుని, కనెక్టివిటీని మెరుగుపరచాలని నిర్ణయించామన్నారు. వివిధ వేదికల పై పర్యాటక రంగానికి మరింత ప్రాచుర్యం కల్పించేందుకు అవసర మైన నిధులు కేటా యించి అనంతరం త్వరితగతిన విడుదల చేయాలని కోరారు.

ఈ సందర్భంగా 2014, 19 కాలానికి సంబంధించిన పాత బకాయిల చెల్లింపుల పై కూడా సానుకూలంగా చర్చించి, తగు నిర్ణయం తీసుకుంటామని ఆర్థిక మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన పర్యాటక ఉత్సవాల అంశం చర్చకు వచ్చింది. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, సెక్రటరీ రోనాల్డ్ రాస్, పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, టూరిజం ఎండీ ఆమ్రపాలి కాట, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు పర్యాటక శాఖ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమైన మంత్రి దుర్గేష్ ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులను పూర్తి చేయాలని, పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పీపీపీ విధానంలో సాగుతున్న ప్రాజెక్టులు, కొత్తగా చేపట్టాల్సిన క్యాపిటల్ వర్క్స్, పార్కుల అభివృద్ధి, పర్యాటకుల భద్రతపై అధికారులకు మంత్రి కందుల దుర్గేష్ దిశానిర్దేశం చేశారు. తూర్పు భారతదేశంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు, పర్యాటకం, సంస్కృతిని ప్రోత్సహించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్కు సంబంధించిన పర్యాటక ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. పూర్వోదయ క్రింద పర్యాటక సౌకర్యాలను అప్గ్రేడ్ చేయడం, కనెక్టివిటీని మెరుగుపరచడం మరియు పర్యాటక సంబంధిత కార్యకలాపాల ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థలను పెంచడం, పర్యాటకాభివృద్ధి చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు ఈ సందర్భంగా అధికారులు వివరించారు.

# దేశ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యత రణ్‌ధీర్ జైస్వాల్

**ముడిచమురు కొనుగోళ్ల పై భారత్**




**న్యూ ఢిల్లీ: పెన్ సత్తా, ఫిబ్రవరి 05:** రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేసేందుకు భారత్ అంగీకరించిందని ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. భారత్ పై సుంకాలను తగ్గించామని సోషల్ మీడియాలో ప్రకటిస్తూ ఈ అంశాన్నీ వెల్లడించారు. తమ మధ్య ట్రేడ్ డీల్ కుదిరిందని ప్రకటించిన సందర్భంగా భారత్- రష్యా చమురు అంశాన్ని ప్రస్తావించారు ట్రంప్. ఈ విషయ మై భారత విదేశాంగ శాఖ తొలిసారిగా స్పందించింది. ఇంధన రంగంలో ప్రస్తుతం నెలకొన్న అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో తాము 140 కోట్ల మంది దేశ ప్రజల ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేసింది. దేశ ఇంధన భద్రత, చమురు కొనుగోళ్ల పై భారత ప్రభుత్వం ఇప్పటికే తన వైఖరిని పలుమార్లు బహిరంగంగా స్పష్టం చేసింది. 140 కోట్ల మంది భారత ప్రజల ఇంధన భద్రతను కాపాడటానికే ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తోంది. మార్కెట్ పరిస్థితులు, అంతర్జాతీయ పరిణామాలను అనుసరించి వివిధ దేశాల నుంచి ఇంధన దిగుమతులను కొనసాగించే వ్యూహాన్ని భారత్ అనుసరిస్తోంది. భారత్ ఇప్పటివరకూ తీసుకున్న నిర్ణయాలు, ఇక పై తీసుకునే నిర్ణయాలన్నీ ఇదే పంథాలో ఉంటాయి అని విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ ఓ ప్రకటనలో తెలిపారు. రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేయడంతో పాటు వెనెజువెలా, అమెరికాల నుంచి ముడి చమురు దిగుమతులకు భారత్ సిద్ధంగా ఉందని కూడా ట్రంప్ పేర్కొన్నారు. ఈ అంశం పై కూడా రణ్‌ధీర్ జైస్వాల్ స్పందించారు. వెనెజువెలాతో ఎంతో కాలంగా భారత్ కు వాణిజ్య భాగస్వామ్యం ఉందని గుర్తు చేశారు. వెనెజువెలా చమురు కొనుగోలుకు తాము సుముఖంగానే ఉన్నామన్నారు. దీంతో పాటు వాణిజ్య పరంగా అవకాశం ఉన్న అన్ని చోట్ల నుంచి ముడి చమురును దిగుమతి చేసుకుంటామని స్పష్టం చేశారు. ఇక ట్రంప్ ప్రకటన పై ఇటీవలే రష్యా కూడా స్పందించింది. చమురు కొనుగోళ్లను నిలిపివేసినట్టు తమకు భారత్ నుంచి ఎలాంటి సమాచారం అందలేదని తెలిపింది. భారత్-అమెరికా దౌత్య బంధాన్ని తాము గౌరవిస్తామని రష్యా ప్రభుత్వ ప్రతినిధి తెలిపారు. అదే సమయంలో భారత్ తో వ్యూహాత్మక భాగస్వామ్యానికి అంతే ప్రాముఖ్యతను ఇస్తామని అన్నారు. తమ తొలి ప్రాధాన్యత ఇదేనని కూడా స్పష్టం చేశారు. ఇక ట్రేడ్ డీల్‌కు సంబంధించి భారత్,

# అప్పు కోసం వరల్డ్ బ్యాంక్ అధ్యక్షుడు ని కాకా పడుతున్న పాక్






**పాకిస్తాన్: పెన్ సత్తా, ఫిబ్రవరి 05:** కటిక దరిద్రంలో కొట్టు మిట్టాడుతున్న పాకిస్థాన్.. అప్పు పుట్టడం కోసం ఏ స్థాయి కైనా దిగజారుతోంది. తాజాగా భారత సంతతికి చెందిన ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా పాకిస్థాన్‌లో 4 రోజుల పర్యటనకు రాగా షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం ఆయనకు అసాధారణ రీతిలో ఘనస్వాగతం పలికింది. దేశ ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించేందుకు రుణాలు కావాల్సి రావడంతో ఈ పర్యటనను పాక్ ప్రభుత్వం ఓ భారీ సాంస్కృతి వేడుకలా మార్చేసింది. ఈ మట్టి కొడుకు అంటూ సెంటి మెంట్ పాలిటిక్స్ ప్లే చేసింది. అజయ్ బంగా పూర్వీకులు 1947 విభజనకు ముందు పాకిస్థాన్ లోని పంజాబ్ ప్రావిన్స్ లోని ఖుషాబ్ జిల్లాలో ఉండేవారు. అప్పుల కోసం పాక్ ప్రభుత్వం ఆయన పర్యటనలో ఈ సెంటి మెంట్ కార్డును వాడింది. బంగా తన పూర్వీకుల ఇంటిని సందర్శించినప్పుడు స్థానిక అధికారులు ఆయనను మిట్టి కా బేటా (ఈ మట్టి కొడుకు) అని సంబోధిస్తూ ఘనంగా ఆహ్వానించారు. ఆయన కుటుంబ ఆస్తులకు సంబంధించిన దశాబ్దాల నాటి అసలు రెవెన్యూ రికార్డులను అధికారులు ఆయనకు బహుమతిగా అందజేశారు. ఆయనను ప్రసన్నం చేసుకోవడం కోసం గోడలకు రంగులు వేయించి, పంజాబీతో పాటు హిందీ భాషలో కూడా స్వాగత నినాదాలు రాయించడం విశేషం. అప్పుల కుప్పలో పాక్!: పాకిస్థాన్ ప్రస్తుతం సుమారు 130 బిలియన్ డాలర్ల విదేశీ అప్పుల్లో ఉంది. ఇందులో దాదాపు 20 శాతం వాటా ప్రపంచ బ్యాంకుదే. 2025 చివరలో పబ్లిక్ సర్వీసుల కోసం వరల్డ్ బ్యాంక్ 700 మిలియన్ డాలర్ల అప్పును విడుదల చేసింది. ఇప్పుడు పాక్ చూపు తదుపరి భారీ రుణాల పై ఉంది. అందుకే అప్పు ఇచ్చే వారిని ప్రసన్నం చేసుకోవడానికి షెహబాజ్ ప్రభుత్వం ఎంతటి తమాషా చేయడాని కైనా సిద్ధపడింది.


20 బిలియన్ డాలర్ల కోసం పాకులాట: తన పర్యటనలో భాగంగా ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్థిక మంత్రి మహమ్మద్ ఔరంగ జేబు తో కీలక భేటీలు నిర్వహించారు. రాబోయే పదేళ్లలో పాకిస్థాన్ సుమారు 20 బిలియన్ డాలర్ల వరకు రుణం పొందేలా కంట్రీ పార్టనర్ షిప్ ఫ్రేమ్‌వర్క్ పై చర్చలు జరిగాయి. అయితే ఈ రుణం అందాలంటే పాకిస్థాన్ తన పాలనలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టాలని ప్రపంచ బ్యాంకు షరతు విధించింది. ఓ వైపు అప్పుల కోసం వివిధ దేశాల ముందు తలవంచుకుని నిలబడాల్సి వస్తోందని ప్రధాని షెహబాజ్ షరీఫ్ వాపోతుంటే, మరో వైపు అప్పు ఇచ్చే సంస్థల అధిపతుల పర్యటనలను వినోద ప్రదర్శనలుగా మార్చడం పాక్ దౌత్య వైఫల్యానికి అద్దం పడుతోంది. వారసత్వాన్ని గౌరవించడం కంటే, దేశ ఉనికిని కాపాడు కోవడానికి పాక్ చేస్తున్న అప్పుల డ్రామా గా ఇది కనిపిస్తోందని విమర్శకులు పేర్కొంటున్నారు.

# కర్ణాటక వ్యక్తికి రూ. 49 కోట్ల జాక్ పాట్




**ఇంటర్నెట్ డెస్క్: పెన్ సత్తా, ఫిబ్రవరి 05:** కర్ణాటక వాసిని అదృష్టం వరించింది. అబుదాబి వేదికగా జరిగే బిగ్ టికెట్ లాటరీ లో ఉడిపి జిల్లాలకు చెందిన 33 ఏళ్ల శాంతను షెట్టిగార్ కు బంపర్ ఆఫర్ వచ్చింది. లక్కీ డ్రాలో 20 మిలియన్ దిర్హామ్ లు గెలుచుకున్నాడు. భారతీయ కరెన్సీలో దీని విలువ సుమారు రూ. 49 కోట్లు.. ఈ విషయం తెలియడంతో కర్ణాటక లోని అతని సొంత గ్రామంలో సెలబ్రేషన్లు స్టార్ట్ అయ్యాయి. ఈ భారీ విజయంతో ఆయన స్వస్థల మైన ఉడిపిలో సంబరాలు మొదలయ్యాయి. మంగళవారం ఆన్ లైన్ లో ఈ లాటరీ ఫలితాలు వెల్లడయ్యాయి. ఉడిపి జిల్లా లోని ఉద్యవర్‌కు చెందిన 33 ఏళ్ల షంతను షెట్టిగర్.. ఈ వారం అబుదాబిలో జరిగిన లైవ్ డ్రాలో జాక్ పాట్ ను దక్కించుకున్నారు. సిరీస్ 283, టికెట్ నంబర్ 305810 తో కూడిన విజేత ఎంట్రీని టెలివిజన్ రాఫెల్ ఈవెంట్ లో ప్రకటించారు. ప్రస్తుతం ఒమన్ లోని మస్కట్‌లో రిటైల్ రంగంలో పనిచేస్తున్న షెట్టిగర్, ఈ విజేత టికెట్‌ను ఒక స్నేహితుడితో కలిసి కొనుగోలు చేశారని నిర్వాహకులు తెలిపారు. గల్ఫ్ ప్రాంతం నుండే కాకుండా అనేక దేశాల నుండి పాల్గొనే వారిని ఆకర్షించే ప్రసిద్ధ నెలవారీ డ్రా ఇది. బహుమతి ప్రకటించాక నిర్వాహకులతో మాట్లాడిన షెట్టిగర్, ఈ అనుకోని విజయం పట్ల ఆశ్చర్యం, సంతోషం వ్యక్తం చేశారు. ప్రణాళిక ప్రకారం గెలుచుకున్న మొత్తాన్ని తన టికెట్ భాగస్వామితో పంచుకుంటానని తెలిపారు. విజయావకాశాలను పెంచుకునేందుకు ఇలా ఉమ్మడి టికెట్లు కొనుగోలు చేయడం సహజం. ఈ విషయం ఉడిపి చేరుకోగానే, స్నేహితులు, బంధువులు ఇది సమాజానికి గర్వకారణమని అన్నారు. షెట్టిగర్ విదేశాల్లో ఉన్నా తన స్వస్థలంతో సన్నిహిత సంబంధాలను కొనసాగించారని స్థానికులు పేర్కొన్నారు. ఇటీవల కాలంలో భారతీయ ప్రవాసులు సాధించిన పలు జాక్ పాట్ విజయాల జాబితాలో ఈ విజయం కూడా చేరింది.

# ప్రధానమంత్రి ఉజ్వల యోజనలో గ్యాస్ కనెక్షన్ పంపిణీ చేసిన బండారు





**దేవరాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 05:** మండల కేంద్రంలో గురువారం ప్రధానమంత్రి ఉజ్వల యోజన 3.0 లో భాగంగా మహిళలు ఉచిత గ్యాస్ కనెక్షన్ పంపిణి కార్యక్రమం నిర్వహించారు. మాడుగుల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ శాసన సభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి పాల్గొని మండలంలో 566 మంది లబ్ధిదారులకు కలెక్షన్ అందజేశారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో పేద కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగు పడేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి అన్నారు. యువతకు ఉపాధి కల్పనకు మంత్రి నారా లోకేష్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. రాష్టాన్ని అన్నివిధాలుగా దెబ్బతీయడాని జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి నాయకులకు తమ ప్రభుత్వంలో గత ఐదేళ్లు చేసిన అరాచకాయలు చేసారని ఆరోపించారు. అవి చాలక ఇప్పుడు, కులాల మధ్య అరాచకాలు సృష్టించి రాష్టానికి వస్తున్న పెట్టుబడులను చెడగొట్టాలి అని విశ్వ ప్రయత్నం చేస్తున్నారు అని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ విషయాలను ప్రజలు గమనించి రాబోయే స్థానిక సంస్థల్లో వైసిపి పార్టీకి తగిన బుద్ది చెప్పాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కర రావు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు గోరుపోటు రామ్మూర్తి నాయుడు, మండల పార్టీ జనరల్ సెక్రటరీ దొగ్గ దేముడు నాయుడు, సోమిరెడ్డి గోవిందా, సత్తిబాబు, దేవరాపల్లి మండల బ్యాంకు ఛైర్మన్ తాతయ్యలు, జామి నాయుడు, గొర్లి నాయుడు బాబు, గాడి సూర్యనారాయణ, బత్తి రమేష్, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# గీతం అదీనంలో ఉన్న భూముల పై ప్రజలకు స్పష్టత ఇవ్వాలి కేకే రాజు.

- గీతం ఆక్రమణలో ఉన్న భూముల పై ప్రజలకు అనేక అనుమానాలు ఉన్నాయయి.
- భూముల వివరాలను బహిర్గతం చేయులని వైసీపీ డిమాండ్.





**విశాఖపట్నం, పెన్ సత్తా, ఫిబ్రవరి 05:** విశాఖ జిల్లా పార్టీ అధ్యక్షులు కె.కె రాజు ఆధ్వర్యంలో నియోజకవర్గ సమన్వయకర్తలు, శాసన మండలి సభ్యులు, మాజీ శాసన సభ్యులు, కార్పొరేటర్లు తో కలిసి జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ని కలసి గీతం అదీనంలో ఉన్న భూముల పై ప్రజలకు స్పష్టత ఇవ్వాలి అని జిల్లా వైఎస్సార్సీపీ పార్టీ అధ్యకుడు కేకే రాజు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ ఎండాడ రుషికొండ గ్రామాలకు సంబంధించిన 54 ఎకరాలు 79 సెంట్ల ప్రభుత్వ భూమిని ఒక ప్రైవేటు యూనివర్సిటీకి (గీతం యూనివర్సిటీ) బదలాయించేందుకు ప్రతిపాదన రావడం వల్ల విశాఖ ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. విశాఖపట్నం రూరల్ తహసీల్దారు ద్వారా జీవీఎంసీ కమిషనర్ కి భూమి బదలాయింపు ప్రతిపాదన పంపడం జరిగిందని, జనవరి 30 న జరిగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఈ ప్రతిపాదనను 15 వ అంశంగా అజెండాలో చేర్చారన్నారు. ఎలాంటి ప్రజాస్వామిక చర్చ లేకుండా సభ్యుల స్పష్టమైన ఆమోదం లేకుండానే ఏకపక్షంగా ఆమోదించడం పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ భూమి బదలాయింపును విశాఖపట్నం ప్రజలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున జిల్లా కలెక్టర్ కి స్పష్టం చేశామన్నారు. మొత్తం 54 ఎకరాలు 79 సెంట్లలో ఎంత ప్రభుత్వ భూమి ఉంది?, అందులో గెడ్డ పోరంబోకు భూమి ఎంత?, ఎస్ఐఓడి భూమి ఎంత మేరకు ఉంది?, భూమి బదలాయింపు నిర్ణయానికి సంబంధించిన పూర్తి ఫైల్ వివరాలు ప్రజలకు తెలియజేయాలి అని కోరినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ని ప్రజల ఆస్తిని కాపాడాల్సిన బాధ్యత మీపై ఉందని గుర్తు చేస్తూ, ఈ బదలాయింపును వెంటనే నిలిపివేయాలని కోరారు.

గీతం యూనివర్సిటీకి భూమి బదలాయింపు అంశం పై ప్రజాభిప్రాయాన్ని గౌరవించి న్యాయమైన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాలో సమన్వయకర్తలు మొల్లి అప్పారావు, తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి, శాసన మండలి సభ్యులు కుంభ రవి బాబు, డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్, ఎస్.సి సి సభ్యులు బాణాల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి పి.వి.నారాయణ, కోరుకొండ వెంకట రత్న స్వాతి దాస్, పళ్ళ దుర్గ, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు ఉరుకూటి రామచంద్రరావు (చందు), పేడాడ రమణి కుమారి, బర్కత్ అలీ, బొండా ఉమా మహేశ్వర్ రావు, బోని శివ రామ కృష్ణ, జీలకర్ర నాగేంద్ర, కార్పొరేటర్లు దౌలపల్లి ఏడుకొండల రావు, సాడి పద్మారెడ్డి, బిపిన్ కుమార్ జైన్, వావిలపల్లి ప్రసాద్, రేయ్యి వెంకట రమణ, శేశికల్, పివి సురేష్, గుడివాడ సాయి అనూష లతీష్, వార్డు అధ్యక్షులు బొడ్డేటి గోవింద్, శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్, జిల్లా కార్యదర్శి ఉమ్మడి దాస్, పార్టీ నాయుకులు గుడివాడ లతీష్, సూర్య, మహేష్, మూలక రెడ్డి, బంగారు భవాని శంకర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేసి సుందరపు



**రాంబిల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 05:** మండలంలో ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసి, వుధ్యాయుని అవతారంలో విద్యార్థుల విద్యా బోధనను తనిఖీ, ప్రేరణాత్మక సందేశంలో సమాజం పై అవగాహన, పరీక్షలు రాయడంలో మెళుకువలు, చేతి దస్తూరి పై అవగాహన కల్పించిన నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్. గురువారం మండలంలో జెడ్పిహెచ్ఎస్ స్కూల్ కొత్తూరు, జెడ్పిహెచ్ఎస్ స్కూల్ మూలజంప, జెడ్పిహెచ్ఎస్ స్కూల్ పంచదార్ల పాఠశాలలను విజయ్ కుమార్ తనిఖీ చేశారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు లేకుండా చూసుకుని విద్యార్థులతో వారు చదివే విధానాన్ని, ప్రతీ సబ్జెక్ట్ పై వారికున్న జ్ఞానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థి దశలో ఉన్నప్పటి నుండే సమాజం, దేశం, తమ భవిష్యత్ పై బాధ్యతలను అలవరుచు కోవాలన్నారు.

ముఖ్యంగా తరగతి గదిలో కూర్చున్నప్పటి నుంచి టీచర్లు చెప్పే పాఠాలు, సామజిక అంశాల పై ప్రశ్నలు తయారు చేసుకుని, టీచర్లతో వాటికి సమాధానాలను తెలుసుకుని చర్చించాలన్నారు. అదే విధంగా ప్రతీ విద్యార్థి చేతి దస్తూరిని వృద్ధి పరిచుకోవాలని, చేతి దస్తూరి బాగున్నట్లైతే పరీక్షలలో మరిన్ని మార్కులు సాధించవచ్చని తెలిపారు.10 వ తరగతి విద్యార్థిని, విద్యార్థులు తొందరలో పరీక్షలు సమీపిస్తునున్నందున వాటికి పాత్యాంశాలను సంపూర్ణంగా మననంచేసి సంసిద్ధంగా ఉండాలని సూచించారు. అనంతరం పాఠశాలలలో జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశిలించి, విద్యార్థులతో నాణ్యమైన ఆహారాన్ని మెనూకు తగ్గట్టుగా ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్ ఈ ఓ లు, ప్రధాన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ముగిసిన అమెరికా-రష్యా అణు ఒప్పందం



**ఇంటర్నెట్ డెస్క్: పెన్ సత్తా, ఫిబ్రవరి 05:** అమెరికా, రష్యాల మధ్య ఉన్న ఏకైక అణు నియంత్రణ ఒప్పందం న్యూ స్టార్ట్ గడువు నేటితో ముగిసింది. మూడు దశాబ్దాల అణు నియంత్రణ సహకారానికి ఇది ముగింపు పలికింది. ఈ ఒప్పందం ముగియడం వల్ల అదుపు లేని అణు ఆయుధ పోటీకి దారితీస్తుందనే అంతర్జాతీయ ఆందోళనలు పెరుగుతున్నాయి. 2010 లో అప్పటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా, రష్యా అధ్యక్షుడు దిమిత్రి మెద్వెదేవ్ న్యూ స్టార్ట్ పై సంతకాలు చేశారు. అణు అస్త్రసారూప్యంలో రష్యాకు అమెరికాతో సమానమైన హోదాను ఇచ్చింది. 2021లో జో బైడెన్ ఐదేళ్ల పాటు పొడిగించిన ఈ ఒప్పందం, ఇరు దేశాల అణు వార్‌హెడ్ లను 1,550 కి పరిమితం చేసింది. ఈ ఒప్పందం కింద, వ్యూహాత్మక అణు శక్తుల సమాచారం పంచు కోవడం, క్షిపణుల స్థావరాల్లో ప్రత్యక్ష తనిఖీలు తప్పనిసరి. పారదర్శకత, తనిఖీలకు కీలక మైన ఈ వ్యవస్థ ఇప్పుడు నిలిచిపోయింది, భద్రత పై ఆందోళనలు తీవ్రమవుతున్నాయి. ప్రపంచ అణు ఆయుధాలలో 87% అమెరికా, రష్యాల వద్దే ఉన్నాయి. ఒప్పందం ముగియడంతో, అణు ఆయుధ ఉత్పత్తి, విస్తరణ పై రెండు దేశాలకూ పరిమితులు లేవు. ఉక్రెయిన్ యుద్ధ ఉద్రిక్తతల మధ్య ట్రంప్, పుతిన్ ఒప్పందాన్ని పొడిగించడానికి ఇష్టపడకపోవడం దీనికి కారణం. డొనాల్డ్ ట్రంప్ ఒప్పంద పునరుద్ధరణకు ఆసక్తి చూపలేదు. గత నెలలో న్యూయార్క్ టైమ్స్‌తో ఒకవేళ అది గడువు ముగిస్తే, ముగిసిపోతుంది అని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ ఆయుధ నియంత్రణ పరిమితులను విమర్శిస్తూ, గత సంవత్సరం అణు ఆయుధ పరీక్షలను పునఃప్రారంభించమని సైన్యానికి ఆదేశించారు. ట్రంప్ రష్యా ప్రతిపాదనను పట్టించు కోనప్పుడు, అణు వార్‌హెడ్‌ల పరిమితులకు తాము కట్టుబడి ఉండబోమని రష్యా ప్రకటించింది. అయినప్పటికీ, గత బుధవారం షీ జిన్‌పింగ్ తో పుతిన్ మాట్లాడుతూ, రష్యా మితంగా, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుంది అని ఏపీ నివేదించింది. ఒప్పందం పై సంతకం చేసిన రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రి మెద్వెదేవ్, గడువు ముగియడం వల్ల కలిగే ప్రమాదాల పై తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇది వెంటనే విపత్తుకు దారితీయడమే కాకుండా అణు యుద్ధం కూడా ప్రారంభమవుతుంది. ఇది ప్రతి ఒక్కరినీ అప్రమత్తం చేయాలి అని ఆయన మాస్కోలో విలేకరులతో అన్నారు. చైనా అణు ఆయుధాగారాన్ని పెంచుతుండటం పట్ల అమెరికా ఆందోళన చెందుతోంది. చైనాతో సరిహద్దు వివాదాలున్న భారత్ కు కూడా ఇది ఆందోళన కలిగిస్తోంది. చైనా అణు వార్‌హెడ్‌లు సుమారు 600, అమెరికా అణు ఆయుధాగారం కంటే 12% తక్కువ. మరోవైపు, ఫ్రాన్స్, యునైటెడ్ కింగ్ డమ్ లను చేర్చాలని రష్యా డిమాండ్ చేసింది. ఈ డిమాండ్లు చర్చలను సంక్లిష్టం చేస్తున్నాయి. ఈ పరిణామం ఐక్యరాజ్య సమితిని కలవరపరిచింది. అమెరికా, రష్యాలు వెంటనే ఒప్పందాన్ని పునరుద్ధరించాలని ఐరాస విజ్ఞప్తి చేసింది. ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ మాట్లాడుతూ, అణు ఆయుధాన్ని ఉపయోగించే ప్రమాదం దశాబ్దాలలో అత్యధిక స్థాయిలో ఉందని హెచ్చరించారు. అర్ధ శతాబ్దానికి పైగా మొదటిసారిగా, రెండు అగ్రరాజ్యాల అణు ఆయుధాగారాల పై ఎటువంటి పరిమితులు లేని ప్రపంచాన్ని మనం ఎదుర్కొంటున్నాం అని ఆయన పేర్కొన్నారు. కొత్త అణు ఆయుధ పోటీని నివారించడానికి సాధ్య మైనదంతా చేయాలి అని పోప్ నొక్కి చెప్పారు. ఈ ఒప్పందం ముగియడం ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర పరిణామాలు కలిగిస్తుందని అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది. న్యూ స్టార్ట్ ఒప్పందం ముగియడం 1970 నాటి అణు విస్తరణ నిరోధక ఒప్పందం కి తక్షణ ముప్పు. ఈ ఒప్పందం ఎన్పిటి పునాదిని బలహీనపరుస్తుంది. ఎన్పిటి కింద, అణు ఆయుధాలు లేని దేశాలు వాటిని పొందకుండా, అణు దేశాలు ఆయుధాగారాలను తగ్గించి వదిలివేస్తామని హామీ ఇచ్చాయి. అమెరికా, రష్యాలు అణు ఆయుధాలను పెంచడం ప్రారంభిస్తే, అణ్వేతర దేశాలు తమ ఒప్పందాన్ని ఉల్లంఘించారని ఆరోపించగలరు. ఇది ప్రపంచ అణు ఆయుధ పోటీని వేగవంతం చేస్తుంది. వాస్తవానికి, అణు శక్తులను ఆధునీకరించడం మొదలు పెట్టాయి, కొత్త ఆయుధ పోటీ ఇప్పటికే జరుగుతోంది. గత సంవత్సరం, రష్యా 'పోసిడాన్' అనే అణుశక్తితో నడిచే ఇంటర్ కాంటినెంటల్ సూపర్ టార్పెడోను, బురెవెస్ట్నిక్ అనే అణు ఆయుధ క్రూయిజ్ క్షిపణిని పరీక్షించింది. ఇది రష్యా అణు సామర్థ్యాల విస్తరణను స్పష్టం చేస్తోంది. దీర్ఘ-శ్రేణి ఆయుధాల నుండి ఉత్తర అమెరికాను రక్షించడానికి గోల్డెన్ డోమ్ ను నిర్మించే ప్రణాళికలను ట్రంప్ ఉధృతం చేశారు. గ్రీన్ ల్యాండ్ స్వాధీనం చేసుకోవాలన్న తన ఆకాంక్షకు రష్యా నుంచి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ట్రంప్ పేర్కొన్నారు. 2025 నెట్‌ఫ్లిక్స్ థ్రిల్లర్ 'ఎ హౌస్ ఆఫ్ డైనమైట్'లో, గుర్తు తెలియని బాలిస్టిక్ క్షిపణి అమెరికా పైకి ప్రయోగించబడిన సంక్షోభాన్ని చిత్రీకరించారు. ఇది ఊహాజనిత మైనప్పటికీ, అస్థిర ప్రపంచ క్రమం మధ్య భవిష్యత్తులో ఏమి జరుగుతుందో ఎవరికీ తెలియదు. భవిష్యత్తులో అమెరికా, రష్యా కొత్త అణు ఆయుధ ఒప్పందం పై సంతకాలు చేయవచ్చు. ప్రస్తుతానికి, ఈ ఒప్పందం ముగియడం అస్థిర మైన, ఉద్రిక్తతలతో కూడిన కాలాన్ని సూచిస్తోంది. ప్రపంచ భద్రతకు ఇది కీలక మలుపుగా మారింది.

# పర్యాటక ప్రదేశాల్లో సన్నద్ధతను క్షేత్ర స్థాయిలో సమీక్షించిన చైర్మన్








**విశాఖపట్నం, పెన్ సత్తా, ఫిబ్రవరి 05:** ఐఎఫ్ఆర్ ను పురస్కరించుకొని విఎంఆర్డిఏ పర్యాటక ప్రదేశాల్లో సన్నద్ధతను క్షేత్ర స్థాయిలో సమీక్షించిన చైర్మన్, మెట్రోపాలిటన్ కమిషనర్. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ నెల 18, 19 వ తేదీలలో విశాఖలో జరుగుతున్న ( ఐఎఫ్ఆర్) అంతర్జాతీయ యుద్ధ నౌకల విన్యాసముల సందర్భంగా విఎంఆర్డిఏ నిర్వహిస్తున్న ప్రముఖ పర్యాటక ప్రదేశాల్లో చేపడుతున్న మరమ్మత్తు పనులను, పచ్చదనం పెంపునకు సంబంధించిన పనులను నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని విఎంఆర్డిఏ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్ ఆదేశించారు. వివిధ పర్యాటక ప్రాంతాల్లో ప్రగతిని క్షేత్ర స్థాయిలో ఎంవి ప్రణవ్ గోపాల్, తేజ్ భరత్ లు కలిసి సంయుక్తంగా పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖలో జరిగే అంతర్జాతీయ యుద్ధ నౌకల విన్యాసాల సమీక్ష ను విజయవంతం చేసేలా పలు సూచనలు చేశారని ప్రణవ్ గోపాల్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సూచనలతో విఎంఆర్డిఎ పరిధిలో అన్ని పర్యాటక ప్రాంతాలని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. అన్ని చోట్ల ఎక్కడికక్కడ డస్ట్ బిన్స్ ఏర్పాటు చేసి, శుభ్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, అదే విధంగా టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్ మాట్లాడుతూ పచ్చదనం మరింత పెంచాలని, సందర్శకులకు త్రాగునీటి సదుపాయం కల్పించాలని, వారికి ఎటువంటి అసౌకర్యం లేకుండా అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం అధికారులతో కుర్సుర సబ్మెరైన్ మ్యూజియం, సీహారియర్, యుహెచ్ యుహెచ్ 3 హెచ్ హెలికాప్టర్ మ్యూజియం, టియు -1 42 యుద్ధ విమాన మ్యూజియంల వద్ద చేపడుతున్న పనులను పరిశీలించారు. అదేవిధంగా కైలాసగిరి పై అభివృద్ధి పనులను, తెన్నేటి పార్క్ నందు పనులను కూడా పరిశీలించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దుర్గమాంబ అమ్మవారిని దర్శించుకున్న బండారు







**పరవాడ, పెన్ సత్తా, ఫిబ్రవరి 05:** మండలం లోని కలపాక దుర్గమాంబ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పల నాయుడు. కలపాక గ్రామ దేవత దుర్గమాంబ అమ్మవారి పండగ మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. స్థానిక టిడిపి సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ ఇందల కొండలరావు ఆహ్వానం మేరకు టిడిపి సీనియర్ నేత, మాజీ మంత్రి, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పల నాయుడు ముఖ్య అతిథులుగా దుర్గమాంబ పండగ మహోత్సవానికి విచ్చేసి టిడిపి నాయకులతో అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం రావాడ పంచాయతీ బొట్టవానిపాలెం గ్రామ దేవత మరిడిమాంబ అమ్మవారిని కూడా టిడిపి నాయకులతో ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణ, అప్పల నాయుడు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అట్టా సన్యాసి అప్పారావు, మాజీ సర్పంచ్ ఇందల వరహాలమ్మ, గొర్లి శ్రీనివాస్, ఇందల అశోక్, పయిల చినఅక్కునాయుడు, లోకిరెడ్డి అభి నాయుడు, భోజంకి అప్పల నాయుడు, పయిల వరలక్ష్మి, గొంప మారునాయుడు, బండారు వీరునాయుడు, పయిల ప్రసాద్, బండారు నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆఫ్-సైట్ ఎమర్జెన్సీ ప్లాన్ త్వరితగతిన పూర్తి చేయాలి

క్రైసిస్ గ్రూప్ మేనేజ్మెంట్ సమావేశంలో కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్





**విశాఖపట్నం, పెన్ సత్తా, ఫిబ్రవరి 05:** జిల్లా ఆఫ్-సైట్ ఎమర్జెన్సీ ప్లాన్ ను సాధ్య మైనంత త్వరగా పూర్తిచేసేలా సంబంధిత శాఖలు, పరిశ్రమల యాజమాన్యాలు అవసర మైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు పాతబడిన, పనికిరాని యంత్రాలు, స్క్రాప్, నిరుపయోగ సామగ్రిని తొలగించి, భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని పరిశ్రమల యాజమాన్యాలకు సూచించారు. గురువారం ఉదయం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన క్రైసిస్ గ్రూప్ జిల్లా స్థాయి సమావేశంలో వివిధ అంశాల పై ఆయన మాట్లాడారు. ఈ నెల 17 నుంచి విశాఖపట్నంలో నిర్వహించనున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ నేపథ్యంలో అన్ని పరిశ్రమలు అప్రమత్తంగా ఉండాలని, భద్రతా ఏర్పాట్లు పటిష్టం చేయాలని, ఉద్గారాలు కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలకు అనుగుణంగా అనుమతించిన స్థాయిలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలకు సంబంధించిన వివరాలను క్రైసిస్ గ్రూప్ మెంబర్ సెక్రటరీ, జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సురేశ్ వివరించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆదిశేషు, విశాఖపట్నం పోర్ట్ అథారిటీ భద్రతా విభాగ అధికారులు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సివిల్ డిఫెన్స్ డిప్యూటీ కమాండెంట్, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజలకు జవాబు దారీతనంగా గత 12 ఏళ్లుగా పనిచేస్తున్నా.





- రాష్ట్రం లోనే ఒక ఆదర్శ నియోజకవర్గంగా నెల్లూరు రూరల్ ను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తా.
- నెల్లూరు రూరల్ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి చేస్తున్నాం.

**నెల్లూరు, పెన్ సత్తా, ఫిబ్రవరి 05:** రూరల్ నియోజకవర్గం పరిధి లోనీ కలివెలపాలెం గ్రామంలో 1 కోటి 20 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులను ప్రారంభించిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో రాష్ట్రం లోనే 3 ఫేస్ -24 గంటల కరెంటు పనులను పూర్తి చేసిన మొదటి నియోజకవర్గం నెల్లూరు రూరల్ అని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు.

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అన్ని స్మశాన వాటికలను అన్ని వసతులతో తీర్చిదిద్దుతాం అని రూరల్ కోటంరెడ్డి అన్నారు. ఎన్నికలు లేని వేళ కులాలకు, మతాలకు, పార్టీలకతీతంగా అభివృద్ధిలో కలిసి పనిచేద్దాం రండి అని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఏ.ఎం.సి. చైర్మన్ మనుబోలు శ్రీధర్ రెడ్డి, మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్ కుమార్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ లు సారంగం గున్నయ్య, జలదంకి సుధాకర్, టిడిపి మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ మండల ఇంచార్జ్ వేమిరెడ్డి సురేందర్ రెడ్డి, కలివేలపాలెం పి.ఎ.సి.ఎస్. సొసైటీ చైర్మన్ చెన్నారెడ్డి శ్రీనివాసులరెడ్డి, జెడ్పి కోఆప్షన్ మెంబర్ అలాబక్షు, టిడిపి నాయకులు వెడిచెర్ల వెంకటేశ్వర్లు యాదవ్, చెన్నారెడ్డి సురేందర్ రెడ్డి, యదనపర్తి శ్రీనివాసులు రెడ్డి , జగదీష్ రెడ్డి, రమేష్ రెడ్డి, చెవిరెడ్డి సనత్ కుమార్ రెడ్డి, పోతయ్య, శివప్రసాద్, ఈశ్వరయ్య, వెంకటరమణయ్య, మధు, హజరత్, శ్రీనివాసులు, వెంకట శేషయ్య, సీనయ్య, బెల్లంకొండ కిషోర్ నాయుడు, మురళి రెడ్డి, జడ రాజేష్, లక్ష్మణ్, ముని చంద్ర, కృష్ణయ్య, శ్యామయ్య, రవి, శ్రీనివాసులు, విజయ్ కుమార్, వెంకట్ రావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు యాదవ్, కిరణ్, అల్లాబక్షు, కరిముల్లా, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా 2 మద్యం బార్లకు లైసెన్సుల మంజూరు.

డి.అర్వో. వై.సత్యన్నారాయణ రావు.



**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 05:** అనకాపల్లి జిల్లా పరిధి లోని నోటిఫైడ్ బార్ అండ్ రెస్టారెంట్లకు సంబంధించిన లైసెన్సుల ఎంపిక ప్రక్రియను గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పూర్తి స్థాయి పారదర్శకతతో నిర్వహించారు. లాటరీ ప్రక్రియను జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యన్నారాయణ రావు స్వయంగా పర్యవేక్షించారు. జిల్లాలో పరిధిలో మొత్తం 2 నోటి ఫైడ్ బార్లకు గాను 10 దరఖాస్తులు అందాయని, లాటరీ నిర్వహించి ఇద్దరు విజేతలను ఎంపిక చేసి మరియు ప్రతి బార్‌కు ఆర్1, ఆర్ 2 రిజర్వ్ అభ్యర్థులను కూడా ఖరారు చేశామన్నారు. డ్రాలో ఎంపి కైన అభ్యర్థులు రూ.13.75 లక్షలు ఒకక్కరు ఎఆర్ఈటి చెల్లింఛి తాత్కాలిక లైసెన్సును పొంది వున్నారు. పూర్తి లైసెన్స్ ఫీజును ఆరు వాయిదాలలో చెల్లించే వెసులుబాటు కల్పించగా, రెండు, మూడో సంవత్సరాల్లో లైసెన్స్ ఫీజు పై ఏటా 10 శాతం పెంపు ఉంటుందని పేర్కొన్నారు. లైసెన్స్ పొందిన వారు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, చట్టాలకు కట్టుబడి, నిర్ణీత ప్రాంగణాల్లోనే వ్యాపారం నిర్వహించాల్సి ఉంటుందన్నారు. విక్రయాలు, నిబంధనల అమలు పై నిశిత పర్యవేక్షణ చేపడతామని, ఉల్లంఘనలు జరిగితే కఠినమైన శాఖా పరమైన చర్యలు తప్పవని డి.అర్వో ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.సుదీర్, ఎ ఈ ఎస్ ఇతర అధికారులు, ఆశావహులు పాల్గొన్నారు.

# లక్ష్యసాధనకు విద్యార్థులు కష్టపడాలి: ప్రిన్సిపాల్ వేము రాజు

విద్యతో పాటు విలువలు అవసరం గురుకులంలో వీడ్కోలు సభ

**పెన్ సత్తా, ఫిబ్రవరి 05:** విలువలతో కూడిన శాస్త్రీయ విద్య ఎంతో అవసరమని ఏన్కూరు గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ వేము రాజు పేర్కొన్నారు. గురువారం గురుకుల పాఠశాల కళాశాలలో పదో తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వేము రాజు మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఉందని తెలిపారు. విద్యతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ, సమాజపట్ల బాధ్యతాభావం విద్యార్థుల్లో ఉండాలని సూచించారు. లక్ష్యసాధన కోసం విద్యార్థులు కష్టపడి శ్రమించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. గురుకులంలో నేర్చుకున్న మంచి విలువలు, నైతికత జీవితాంతం విద్యార్థులకు దారి చూపుతాయని అన్నారు.

అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ గురుకులంలో విద్యార్థులతో గడిపిన సమయం తమకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకొని గురుకులానికి మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎలాంటి సవాళు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని సూచించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు గురుకులంలో గడిపిన మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. తమ వ్యక్తిత్వ వికాసానికి గురుకుల విద్య ఎంతో దోహదపడిందని పేర్కొన్నారు. గురుకులాన్ని, స్నేహితులను విడిచి వెళ్లడం బాధాకరంగా ఉన్నప్పటికీ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సంకల్పించారు.

కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అందరినీ అలరించారు. పాటలు, నృత్యాలు, వినోద కార్యక్రమాలు నిర్వహించి సభలో ఆనందోత్సాహాలు నింపారు. జూనియర్ విద్యార్థులు సీనియర్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆత్మీయంగా వీడ్కోలు పలికారు.

ఈ కార్యక్రమంలో ఏటీపీ శ్రీనివాస్, డిప్యూటీ వార్డెన్ అంజాద్ పాషా, సీనియర్ ఉపాధ్యాయులు ఎం. లక్ష్మి, ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. చివరగా విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి భవిష్యత్తులో విజయాలు సాధించాలని శుభాకాంక్షలు తెలియజేశారు.

## గృహ సర్వే గడువు లోపలే శత శాతం పూర్తి చేయాలి కలెక్టర్





**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 05:** గృహ సర్వే గడువు లోపలే శత శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను అదేశించారు. గురువారం మునగపాక మండలం లోని మునగపాక, అచ్చుతాపురం మండలం లోని హరిపాలెంలో ఏకీకృత కుటుంబ సర్వే ప్రగతిని పరిశీలించారు. గడువు లోపల సర్వే పూర్తి చేయాలని, సచివాలయం సిబ్బంది దీని పై దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో మునగపాక, అచ్చుతాపురం ఎమ్‌పీడీఓలు, డిప్యూటీ ఎమ్‌పీడీఓలు, ఎమ్‌ఎస్‌జీఓలు పాల్గొన్నారు.

# గద్దర్ విగ్రహ ప్రతిష్ఠకు అనుమతులు ఇవ్వాలని సీఎంకు వినతి



**అమరావతి, ఫిబ్రవరి 05:** రాష్టంలో గద్దర్ విగ్రహ ప్రతిష్ఠకు అనుమతులు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి వినతిపత్రం ఇచ్చిన గద్దర్ కూతురు వెన్నెల. అలాగే ఆంధ్రా యూనివర్సిటీ లోని ఆర్ట్స్ కల్చరల్ డిపార్ట్‌మెంట్‌కు గద్దర్ పేరు పెట్టాలని విజ్ఞప్తి. దీని పై చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారని తెలిపిన గద్దర్ కూతురు వెన్నెల.

# నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో నిర్మాణ పనుల పర్యవేక్షణ



**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 05:** ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో నూతన దేవాలయ నిర్మాణ పనులను పర్యవేక్షించిన మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ. వీరికి ఆలయ కార్యవర్గం, సిబ్బంది రామకృష్ణ ని పూర్ణకుంభంతో మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. నూకాంబిక అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే త్వరలోనే పునః ప్రారంభం కానున్న అమ్మవారి దేవాలయం పనులను, అమ్మవారి నూతన దేవాలయ ప్రారంభోత్సవం నకు మిగిలి ఉన్న పనులను, త్వరలో నిర్వహించే అమ్మవారి జాతర మహోత్సవ ఏర్పాట్లును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకుని అనంతరం ఏర్పాట్ల పై సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యళ్ళశ్రీధర్, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి, యర్రవరపు సంతోష్ కుమారి పాల్గొన్నారు.

## భారత్ ఎక్కడి నుంచైనా చమురు కొనుగోలు చేయవచ్చు




భారత్, అమెరికా మధ్య నిర్ణయాత్మకమైన ట్రేడ్ డీల్ జరగడం కీలక పరిణామం గా మారిన విషయం తెలిసిందే. ఇరు దేశాల మధ్య కుదిరిన ఈ ఒప్పందంతో భారత్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై అమెరికా సుంకాలను 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గించింది. అయితే ఒప్పందం నేపథ్యంలో భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే అంశంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. భారతదేశం తన చమురు అవసరాల కోసం ఏ దేశం నుంచి అయినా ముడి చమురు కొనుగోలు చేసే స్వేచ్ఛను కలిగి ఉందని రష్యా స్పష్టం చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ ఈ మేరకు స్పందించారు. రష్యాతో చమురు కొనుగోళ్లను నిలిపివేసి, అమెరికా, వెనిజులా నుంచి చమురును కొనుగోలు చేసేందుకు ప్రధాని నరేంద్ర మోడీ అంగీకరించారని, తద్వారా భారత్‌పై సుంకాలను తగ్గిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ ఒప్పందం వల్ల ఉక్రెయిన్ యుద్ధం ముగియడానికి సహాయపడుతుందని ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలపై స్పందిస్తూ, "భారత్ తన చమురు సరఫరాదారులను వైవిధ్య పరచుకోవడంలో మాకు కొత్తేమీ కనిపించడం లేదు" అని పెస్కోవ్ అన్నారు. "భారత్‌కు రష్యా మాత్రమే ఏకైక చమురు సరఫరాదారు కాదని ప్రపంచ ఇంధన నిపుణులందరికీ తెలుసు. భారత్ ఎప్పుడూ వివిధ దేశాల నుంచి చమురును కొనుగోలు చేస్తూనే ఉంటుంది, కాబట్టి ఇందులో వింతేమీ లేదు" అని ఆయన వివరించారు.

## ఎయిర్ ఇండియా 'నమస్తే వరల్డ్' ఆఫర్లు




ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'నమస్తే వరల్డ్' పేరుతో తీసుకొచ్చిన ఈ ఆఫర్ల కింద విమాన టికెట్‌పై 20 శాతం తగ్గింపు ధరతో విక్రయిస్తున్నది. దీంతో దేశీయంగా ప్రారంభ విమాన టికెట్ ధర రూ.1,499గా నిర్ణయించిన సంస్థ..అంతర్జాతీయ రూట్‌లో రూ.5,033కి విక్రయించనున్నది. ఉత్తర అమెరికా, యూరప్, బ్రిటన్, ఆస్ట్రేలియా దేశాల మధ్య నడిచే విమాన సర్వీసులకు ఈ ఆఫర్ వర్తించనున్నది. గురువారం అర్ధరాత్రి లోపు బుకింగ్ చేసుకోనున్న ప్రయాణికులు ఈ నెల 11 నుంచి డిసెంబర్ 31లోగా ఎప్పుడైనా ప్రయాణించవచ్చునని తెలిపింది. బుకింగ్ చేసుకున్న తేదీని మార్చుకునే అవకాశం కూడా ప్రయాణికులకు కల్పించింది. జీతితీతినిటతిజీ.ఇనీఎ, కంపెనీ మొబైల్ యాప్ ద్వారా బుకింగ్ చేసుకున్న వారికి మాత్రమే ఈ ఆఫర్ వర్తించనున్నది. అలాగే ఎస్బీఐ క్రెడిట్ కార్డుతో బుకింగ్ చేసుకున్నవారికి రూ.10 వేల వరకు రాయితీ లభించనున్నది.

## ఉద్యోగులకు కాగ్నిజెంట్ గుడ్‌న్యూస్




ప్రముఖ ఐటీ సేవల సంస్థ కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ తమ ఉద్యోగులకు గుడ్‌న్యూస్ చెప్పింది. 2025 సంవత్సరానికి గానూ 100శాతం బోనస్ ప్రకటించింది. రెండేళ్లకు ముందే కంపెనీ తన లక్ష్యాలను చేరినందుకు గానూ ఈ బోనస్ చెల్లింపులు చేయనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఈ మేరకు కాగ్నిజెంట్ సీఈఓ ఎస్.రవికుమార్ ఉద్యోగులకు పంపిన ఈ-మెయిల్ సందేశంలో పేర్కొన్నారు. "ఉద్యోగుల క్రమశిక్షణ, పనితీరు, కాగ్నిజెంట్‌పై మన క్లయింట్ల నిబద్ధతకు 2025లో కంపెనీ సాధించిన ఫలితాలే ప్రత్యక్ష ఉదాహరణ. ఉద్యోగుల కృషికి గుర్తింపుగా.. 100శాతం బోనస్ ప్రోగ్రామ్‌ను అమలుచేస్తాం" అని రవికుమార్ తన సందేశంలో తెలిపారు. ఆదాయ వృద్ధి, లాభాలు వంటి అంశాల ఆధారంగా ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ పనితీరు కనబరిచిన అగ్ర శ్రేణి సంస్థల జాబితాలో కాగ్నిజెంట్ చేరింది. 'విన్నర్స్ సర్కిల్'గా అభివర్ణించే ఈ జాబితాలో 2027 నాటికి చేరాలని కాగ్నిజెంట్ లక్ష్యంగా పెట్టుకోగా.. 2025లోనే కంపెనీ దాన్ని సాధించగలిగింది. 2025 మొత్తానికి కాగ్నిజెంట్ ఆదాయం 7% పెరిగి 21.10 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.90 లక్షల కోట్ల)కు చేరింది. జనవరి-డిసెంబరును ఆర్థిక సంవత్సరంగా ఈ కంపెనీ పరిగణిస్తుంటుంది. అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు సాగించే ఈ సంస్థకు ప్రపంచవ్యాప్తంగా మొత్తం 3.50 లక్షల మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు. వీరిలో మెజార్టీ ఉద్యోగులు భారత్‌లోనే పని చేస్తున్నారు.

# 400 బిలియన్ డాలర్ల ఆదాయంతో గూగుల్ సరికొత్త రికార్డు

ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ భారీ ఆదాయంతో సరికొత్త రికార్డు సృష్టించింది. 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కళ్ళు చెదిరే ఫలితాలను ప్రకటించింది. కంపెనీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వార్షిక ఆదాయం ఏ400 బిలియన్ల (దాదాపు 33 లక్షల కోట్లు) మార్కును అధిగమించి సరికొత్త రికార్డును నెలకొల్పింది.ఈ మేరకు గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ ఎక్స్ వేదికగా పూర్తి గణాంకాలతో ఆసక్తికరమైన పోస్టును పెట్టారు. అందులో ఈ అద్భుత విజయానికి ప్రధాన కారణం గూగుల్ ప్రవేశపెట్టిన సరికొత్త ఏఐ మోడల్ 'ఉవఎతినితి 3' అని సీఈఓ సుందర్ పిచాయ్ పేర్కొన్నారు. కంపెనీ చరిత్రలో మరే మోడల్‌కు లేనంత వేగంగా జెమిని 3ని వినియోగదారులు ఆదరిస్తున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఏఐ ప్రపంచానికి పోటీగా గూగుల్ తీసుకొచ్చిన జెమిని యాప్‌ను నెలకు 750 మిలియన్ల మంది యాక్టివ్ యూజర్లు ఉపయోగిస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. దీంతో గూగుల్ క్లౌడ్ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 48% పెరిగి, ఏడాదికి ఏ70 బిలియన్ల రన్-రేట్‌కు చేరుకుంది. అలాగే యూట్యూబ్ యాడ్స్, సబ్‌స్క్రిప్షన్ల ద్వారా 2025లో ఏ60 బిలియన్లకు పైగా ఆదాయం సమకూరినట్లు తెలిపారు.



గూగుల్ సెర్చ్ విభాగం ఆదాయంలో 17% వృద్ధి నమోదు చేసింది. గూగుల్ వన్, యూట్యూబ్ ప్రీమియం వంటి పెయిడ్ సబ్‌స్క్రిప్షన్ల సంఖ్య 325 మిలియన్లు దాటడటంతో భారీగా ఆదాయం సమకూరింది. డైరెక్ట్ ఞఖఎ వినియోగం ద్వారా నిమిషానికి 10 బిలియన్లకు పైగా టోకెన్లను జెమిని ప్రాసెస్ చేస్తోంది. 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గూగుల్ కళ్ళు చెదిరే ఫలితాలను సాధించడంతో పాటు భారీగా ఆదాయాన్ని సమకూర్చుకుంది. దీంతో 2026 ఆర్థిక సంవత్సరంపై సుందర్ పిచాయ్ ధీమా వ్యక్తం చేశారు.

"మా పూర్తి స్థాయి ఏఐ స్టాక్ మా పురోగతికి ఇంధనంగా పనిచేస్తోంది. 2026లోకి మేము మరింత ఉత్సాహంగా, బలమైన స్థితిలో అడుగుపెడుతున్నాము. రాబోయే రోజుల్లో మరిన్ని అద్భుతాలు చూడబోతున్నారు" అని సుందర్ పిచాయ్ తన ప్రకటనలో తెలిపారు. దీంతో కేవలం సెర్చ్ ఇంజిన్‌గానే కాకుండా, ఏఐ, క్లౌడ్ రంగాల్లో కూడా గూగుల్ తిరుగులేని శక్తిగా ఎదుగుతోందని ఈ గణాంకాలు నిరూపిస్తున్నాయి.

# ఎంసీఎక్స్‌లో వెండి ధర 6 శాతం పతనం
# ఇన్వెస్టర్లలో మొదలైన గుబులు




హద్దులు లేకుండా దూసుకుపోయిన వెండి ధరలు ఒక్కసారిగా కుప్పకూలాయి. ఎంసీఎక్స్ మార్కెట్‌లో వెండి ధరలు ఒకే రోజు సుమారు 6 శాతానికి పతనమై అందరినీ ఆశ్చర్యపోయేలా చేస్తున్నాయి. దీంతో కిలో వెండి ధర తన రికార్డు స్థాయి నుంచి భారీగా దిగిరావడంతో ఇన్వెస్టర్లలో గుబులు మొదలైంది. జనవరిలో రూ.4.20 లక్షల గరిష్ట స్థాయిని తాకిన వెండి, ఫిబ్రవరి మొదటి వారంలో ఏకంగా రూ.1.94 లక్షల వరకు పడిపోయింది. అమ్మకాల ఒత్తిడి ఎంత తీవ్రంగా ఉందంటే, మార్కెట్‌లో వెండి ఫ్యూచర్స్ లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ కొత్త ఛైర్మన్‌గా కెవిన్ వార్ష్ నియామకం జరిగే అవకాశం ఉందన్న వార్తలతో డాలర్ ఇండెక్స్ బలపడింది. ఇది బంగారం, వెండి ధరలపై తీవ్ర ఒత్తిడిని పెంచింది. గత నెలలో వెండి ధరలు 150 శాతానికి పైగా పెరగడంతో ఇన్వెస్టర్లు ఒక్కసారిగా లాభాలను స్వీకరించడం ప్రారంభించారు. అదేవిధంగా మరోవైపు 2026 కేంద్ర బడ్జెట్‌లో దిగుమతి సుంకాలపై వచ్చిన ఊహాగానాలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. అంతర్జాతీయ ఎక్స్ఛేంజీలు వెండిపై మార్జిన్ అవసరాలను పెంచడంతో ట్రేడర్లు తమ వద్ద ఉన్న నిల్వలను విక్రయించాల్సి వచ్చింది. ఇంత భారీ పతనం సంభవించినప్పటికీ ఆర్థిక నిపుణులు మాత్రం ఈ పరిణామాన్ని హెల్తీ కరెక్షన్‌గా పేర్కొనడం గమనార్హం.

# మళ్లీ బంగారం, వెండి ధరలు ధమాల్



పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న వేళ పేద, మధ్య తరగతి కుటుంబాలకు బంగారం, వెండి ధరలు అమాంతం దిగి వస్తున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో నేడు 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం10 గ్రాములపై ఏకంగా రూ.5,020 తగ్గి, ప్రస్తుతం రూ. 1,54,420 వద్ద కొనసాగుతోంది. అదేవిధంగా ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములపై రూ.4,600 మేర పడిపోయింది. దీంతో నేటి ధర రూ.1,41,550కు చేరింది. అదేవిధంగా బంగారంతో పాటే వెండి ధర కూడా నేలచూపులు చూసింది. కేవలం ఒక్కరోజు వ్యవధిలోనే వెండి ధర భారీగా పతనమైంది. నిన్నటి ధరతో పోలిస్తే ఏకంగా రూ.20 వేలు తగ్గి, ప్రస్తుతం రూ.3 లక్షల వద్దకు చేరుకుంది. అయితే, గత ఐదు రోజులుగా వరుసగా తగ్గుతూ వచ్చిన ధరలు, నిన్నటి రోజున స్వల్పంగా పెరిగిన విషయం తెలిసిందే. అయితే, ఆ సంతోషం ఎంతోసేపు నిలవలేదు. అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకున్న పరిణామాలు, డాలర్ విలువలో మార్పుల కారణంగా ఒక్క రోజులోనే ధరలు మళ్లీ భారీగా పతనమయ్యాయి. ఈ తగ్గుదల ఇలాగే కొనసాగుతుందా లేదా మళ్లీ పుంజుకుంటుందా అనేది మార్కెట్ నిపుణుల విశ్లేషణపై ఆధారపడి ఉంటుంది.

## అమెరికా ఒత్తిడికి భారత్ తలొగ్గిందా?

న్యూఢిల్లీ: వాణిజ్య ఒప్పందంలో అమెరికా ఒత్తిడికి భారత్ తలొగ్గిందా అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. పార్లమెంటు జరుగుతున్న సమయంలో ఈ ప్రకటన రావడం అనుమానాలకు తావిస్తోందని వ్యాఖ్యానించారు. అమెరికా ఉత్పత్తులపై సున్నా సుంకాలకు భారత్ అంగీకరించిందా అని నిలదీశారు. రైతులకు రక్షణ కల్పించే చర్యలున్నాయా అని బుధవారం ఎక్స్‌లో ఖర్గే ప్రశ్నించారు. 'మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో అమెరికాతో కుదిరిన అణు ఒప్పందం ద్వారా రెండు దేశాల మధ్య సంబంధాల బలోపేతానికి కట్టుబడి ఉన్నామని యూపీఏ ప్రభుత్వం నిరూపించింది. అంతేకాకుండా కీలకమైన ఆ డీల్‌కు సంబంధించిన పలు ఒప్పందాల విషయంలో పార్లమెంటు అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నాం. కానీ ప్రస్తుత ఒప్పందం గురించి దేశంలో ఎవరికీ ఏమీ తెలియదు. ఏకంగా అమెరికా అధ్యక్షుడు ఏకపక్షంగా ప్రకటన చేశారు. పార్లమెంటు జరుగుతున్న సమయంలో బయట ప్రకటన రావడం తగదు' అని ఖర్గే వ్యాఖ్యానించారు.

## ముంబయిలో లిఫ్ట్‌లో గ్యాస్ బెలూన్లు పేలి మంటలు..

ముంబయి: ముంబయిలో గ్యాస్‌తో నింపిన బెలూన్లు ఒక్కసారిగా పేలి లిఫ్ట్‌లో మంటలు చెలరేగిన ఘటన కలకలం రేపింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ముంబయి గోరెగావ్ (వెస్ట్) ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో బెలూన్లు డెలివరీ చేసేందుకు రాజ్‌కుమార్ మహతో అనే వ్యక్తి లిఫ్ట్‌లోకి ఎక్కాడు. అదే సమయంలో వైద్య విద్యార్థిని హిమానీతో పాటు మరో యువకుడు కూడా లిఫ్ట్‌లోకి వచ్చారు. లిఫ్ట్ కదలకముందే బెలూన్లు ఒక్కసారిగా పేలిపోవడంతో భారీగా మంటలు చెలరేగాయి. దీంతో భయంతో ముగ్గురూ వెంటనే లిఫ్ట్ నుంచి బయటకు పరుగులు తీశారు.

## ప్రజాస్వామ్యాన్ని రక్షించండి: మమత

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో కొనసాగుతున్న ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై జోక్యం చేసుకుని ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని సుప్రీంకోర్టుకు ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ విజ్ఞప్తి చేశారు. తమ రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకున్నారని, అర్హులైన ప్రజలను ఓటర్ల జాబితాల్లో చేర్చడం లేదని ఆరోపించారు. సర్ కసరత్తును వ్యతిరేకిస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కోర్టులో బుధవారం ఆమె స్వయంగా వాదనలు వినిపించారు. ఈ ధర్మాసనంలో జస్టిస్ జోయ్‌మల్యాబాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలి కూడా సభ్యులుగా ఉన్నారు. ఎన్నికల సంఘానికి ఇప్పటికే ఆరు లేఖలు రాశానని, తమకు ఎక్కడా న్యాయం జరగలేదని త్రిసభ్య ధర్మాసనానికి మమతా బెనర్జీ తెలిపారు.

సుప్రీంకోర్టు న్యాయం చేయాలని అభ్యర్థించారు. సర్ కసరత్తును భాజపా పాలిత అస్సాంలో ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. వాదనల అనంతరం ఎన్నికల సంఘంతో పాటు పశ్చిమ బెంగాల్ ముఖ్య ఎన్నికల అధికారికి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ఈ నెల 9వ తేదీకల్లా సమాధానం ఇవ్వాలని ఆదేశిస్తూ అదే రోజుకు కేసు విచారణను వాయిదా వేసింది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం తరఫున సీనియర్ న్యాయవాది శ్యామ్‌దివాన్ కూడా వాదనలు వినిపించారు.

## మోదీని చుట్టుముట్టిన మహిళా ఎంపీలు

న్యూఢిల్లీ: విపక్ష మహిళా ఎంపీలు లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీతోసహా అధికార పక్ష ఎంపీల సీట్లను అడ్డుగా నిలుచోవడంతో సభలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాట్లాడవలసి ఉన్న ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని రద్దు చేసుకోవలసి వచ్చింది. 8 మంది విపక్ష ఎంపీలను మంగళవారం సస్పెండ్ చేయడం, ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణేకి చెందిన అముద్రిత పుస్తకం నుంచి చైనాకు సంబంధించిన కొన్ని అంశాలను ఉటంకించడానికి ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అనుమతించకపోవడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్‌సహా విపక్ష పార్టీల ఎంపీలు బుధవారం లోక్‌సభలో అలజడి సృష్టించారు. వాయిదా అనంతరం సాయంత్రం 5 గంటలకు సభా కార్యకలాపాలు తిరిగి ప్రారంభం కాగానే ప్రధాని మోదీ ఇక ప్రసంగిస్తారని భావిస్తున్న సమయంలో అనూహ్యంగా వర్షా గైక్వాడ్, జ్యోతిమణిసహాదం విపక్షానికి చెందిన కొందరు మహిళా ఎంపీలు మోదీతోసహా అధికార పక్షానికి చెందిన ఎంపీల సీట్లను అడ్డుకున్నారు. 'ఏది సరైనదో అదే చేయండి' అన్న అక్షరాలు రాసిన పెద్ద బ్యానర్‌ను పట్టుకుని వారు నిరసన తెలిపారు. 8 మంది విపక్ష ఎంపీల సస్పెన్షన్‌ను వారు తీవ్రంగా ఖండించారు. ఇంతలో స్పీకర్ స్థానంలో ఉన్న సంధ్యా రాయ్ సభను వాయిదా వేశారు.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
PEN SATTA Telugu Daily

## ఎడిటోరియల్

# అహింసా వాది సరిహద్దు గాంధీ

మహాత్మా గాంధీజీ లాగే ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్ అహింసా వాది. జాతిపిత గాంధీ అహింసా మార్గంలో అడుగులు వేసి బ్రిటీష్ పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన స్వాతంత్ర్య సమరయోధుడు. అందుకే అయన సరిహద్దు గాంధీగా పేరెన్నిక గన్నాడు. ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్.... ఈ పేరును ఈ తరానికి చెందిన చాలా మంది విని ఉండక పోవచ్చు. కాని సరిహద్దు గాంధీ అంటే కొంత మందికి అయినా గుర్తుకు రావచ్చు. పాకిస్థాన్‌లోని పంఖ్తూన్ రాష్ట్రంలో ఒక పఠాన్‌గా జన్మించాడు. "ఆయుధం పట్టుకొని యుద్ధం చేసే పఠాన్ కన్నా అహింసా మార్గమే ఆయుధంగా ధరించిన పఠాన్ ప్రమాద కరమైన వ్యక్తి" అని బ్రిటీష్ పాలకులతో అనిపించుకున్న గొప్ప ధీరుడు. "నేను ఎట్టి పరిస్థితుల్లో అహింసా మార్గాన్ని వీడను. పగ, ప్రతీకారం జోలికి వెళ్లను. నన్ను అణచివేసిన, హింసించిన వ్యక్తులను కూడా క్షమిస్తాను" అన్న ప్రతిజ్ఞతో 'కుదాయ్ కిద్మత్ గర్' పేరిట భారత స్వాతంత్ర్య పోరాటానికి స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసిన శాంతి కాముకుడు సరిహద్దు గాంధీ. "బాద్షా ఖాన్" గా కూడా సరిహద్దు గాంధీ పేరుగాంచాడు. స్వాతంత్ర్య సమర యోధుడు, గాంధేయవాది. భారతరత్న పురస్కారాన్ని పొందిన తొలి భారతీయేతరుడు. "ఎర్రచొక్కాల ఉద్యమం" ప్రారంభించిన ప్రముఖుడు. ఆయన అనుచరులను "ఖుదాయీ ఖిద్మత్‌గార్" (భగవత్సేవకులు) అని పిలిచేవారు. అయన పష్తో లేదా పక్తూనిస్తాన్ కు చెందిన రాజకీయ, ధార్మిక నాయకుడు. అబ్దుల్ గఫర్ ఖాన్ భారత దేశంలో బ్రిటిష్ ఆక్రమణకు వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర్య యోధుడు. 'బచా ఖాన్' గా ప్రసిద్ధి చెందిన అయన మహాత్మా గాంధీకి చాలా సన్నిహితుడు, మిత్రుడు, ఆయన భారత దేశంలో సరిహద్దు గాంధీగా, పాకిస్తాన్లో బచా ఖాన్ గా సుపరిచితులు. జనవరి 30, 1948 న మహాత్మా గాంధీ హత్యకు 40 సంవత్సరాల తరువాత జనవరి 20, 1988 న మరణించాడు. ఇస్లాం యొక్క గొప్ప అహింసా సైనికుడు. వేలాది అహింసా పఠాన్‌ల విధేయతను పొందిన గొప్ప జాతీయవాద నాయకుడు. అబ్దుల్ గఫర్ ఖాన్ 1890 ఫిబ్రవరి 6 న నాటి అవిభక్త భారత దేశంలోని, నేటి పాకిస్తాన్లో ఉన్న వాయువ్య సరిహద్దు నగరమైన ఉత్మాన్జైలో జన్మించాడు. 1910 లో, 20 సంవత్సరాల వయస్సులో, బెచే ఉత్మాన్జై లోని ఒక మసీదులో ఒక పాఠశాలను స్థాపించాడు. 1921 లో 'అంజుమాన్-ఇ ఇస్లా-ఇ ఆఫ్ఘనియా' (ఆఫ్ఘన్ రిఫార్మ్ సొసైటీ), అలాగే 1927 లో యువత ఉద్యమమైన 'పాక్తూన్ జిర్గా' స్థాపించాడు. మే 1928 లో, బచా ఖాన్ తీర్థయాత్ర నుండి మక్కాకు తిరిగి వచ్చిన తరువాత, పాష్టో భాషలో నెలవారీ రాజకీయ పత్రిక 'పాక్తూన్' (పాష్తున్) ను స్థాపించాడు. భారత స్వాతంత్ర్యం కోసం ఖాన్, ఐక్య, లౌకిక, స్వతంత్ర దేశం లక్ష్యాన్ని సాధించగల ఏకైక స్థిరమైన మార్గం... గాంధీ 'సత్యాగ్రహం' సూత్రాలను గట్టిగా అవలంబించడం

ద్వారా మాత్రమే, అని నిర్ధారణకు వచ్చాడు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమం ఊపందుకుంది. ఆయన 1920 లలో 'ఖుదై ఖిద్మత్గర్' (దేవుని సేవకులు) ను స్థాపించాడు. 1928 లో ఖాన్ మొట్టమొదటి సారిగా మహాత్మా గాంధీని కలుసు కున్నాడు. భారత కాంగ్రెస్ పార్టీతో సంబంధం కలిగి ఉన్నాడు. అతి త్వరలో ఆయన గాంధీకి అత్యంత సన్నిహితుడు అయ్యాడు. స్వతంత్ర, అవిభక్త, లౌకిక... హిందువులు, ముస్లింలు కలిసి శాంతితో జీవించే భారతదేశం గురించి కలలు కన్నాడు. 1931 లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి వరించినా, "నేను ఒక సాధారణ సైనికుడిని, ఖుదై ఖిద్మత్గర్... అల్లా సేవకునిగా మాత్రమే నేను సేవ చేయాలను కుంటున్నాను" అని చెప్పి సున్నితంగా తిరస్కరించాడు. అయన చాలాకాలం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీలో సభ్యుడిగా మాత్రం ఉన్నాడు. భారత భూభాగంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మహాత్మా గాంధీ పోరాడు తుండగా, అప్పటి వాయువ్య సరిహద్దు ప్రావిన్స్ అని పిలువబడే ఇప్పుడు ఆఫ్ఘనిస్తాన్లో భాగమైన ఆ దేశంలోని వాయువ్య ప్రాంతంలో లక్ష మందిని తుపాకులు వాడడానికి, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అహింసాత్మకంగా పోరాడడానికి ప్రతిజ్ఞ చేయడానికి ఒప్పించాడు. ఆ సైన్యాన్ని అల్లాహ్ సేవకులు ఖుదై ఖిద్మత్గర్ అని పిలిచాడు. లక్ష మంది ముస్లింలు అయన "ఖుదై ఖిద్మత్గర్" లేదా "అల్లాహ్ యొక్క సేవకులు" ఉద్యమంలో చేరారు. మహాత్మా గాంధీ తత్వాన్ని అనుసరించాల్సిన అవసరాన్ని ఖాన్ వారికి వివరించి ఒప్పించాడు. బ్రిటీష్ పాలన ముగిసిన తరువాత భారత దేశాన్ని విభజించ కూడదని డిమాండ్ చేయడం ద్వారా, ఖాన్ ముస్లింలలో చాలా మందికి శత్రువుగా మారాడు. తన ప్రజల హక్కుల కోసం నిరంతరం ఆయుధాలు ఎత్తకుండా కష్టపడ్డాడు. గాంధీ మాదిరిగానే, గఫర్ ఖాన్ తన ప్రజల అభ్యున్నతి స్వాతంత్ర్య సాధన ద్వారానే సాధ్య మని నిజాయితీగా నమ్మాడు. ఖాన్ ప్రావిన్స్ లో పాఠశాలలను తెరిచాడు. మహిళలను సమాజ ప్రధాన స్రవంతిలోకి తీసుకు రావడానికి కృషి చేశాడు. తన అహింసా సైనికులను రోజుకు కనీసం రెండు గంటల సామాజిక పని చేయమని ప్రోత్సహించాడు. భారత విభజనకు తీవ్రంగా వ్యతిరేకించిన ఆయన భారత రాజకీయ నాయకులతో కలసి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నాడు. భారతదేశ రాజకీయ నాయకులతో మరీ ముఖ్యంగా గాంధీ నెహ్రూ, కాంగ్రెస్ పార్టీతో కలసి పోరాటం సలిపాడు. సరిహద్దు ప్రాంతపు ముస్లిం లీడర్లు, ఆయన ముస్లింల ద్రోహి అని 1946 లో హత్యా ప్రయత్నం చేసారు. మొదటి నుంచి దేశ విభజనను వ్యతిరేకిస్తూ వచ్చిన ఖాన్ చివరకు నిర్ణయాన్ని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకే వదిలేశాడు. ఆ సమావేశం అత్యధిక మెజారిటీతో దేశ విభజన తీర్మానాన్ని ఆమోదించింది. ఆ సమావేశంలో గఫర్ ఖాన్‌తో పాటు మహాత్మాగాంధీ, రామ్ మనోహర్ లోహియా, జయప్రకాష్ నారాయణ్‌లు పాల్గొనలేదు.

'మీకు అండగా నిలబడ్డాం. మీతో పాటు పఠాన్లు దేశ స్వాతంత్ర్యం కోసం ఎన్నో త్యాగాలు చేశారు. సరిహద్దు ప్రాంత వాసులకు ద్వేషిగా మారాడు. దేశ విభజన ఆగలేదు. అబ్దుల్ గఫార్ ఖాన్ పరిస్థితి అగమ్యగోచరమయ్యింది. బాద్షా ఖాన్, అనుయాయులు, భారత పాకిస్తాన్ నాయకులు తీవ్రంగా ద్రోహం చేశారని భావించారు. కాంగ్రెస్ పార్టీని, భారత రాజకీయ నాయకులను ఉద్దేశించి బాద్షాహ్ ఖాన్ అన్న ఆఖరి మాటలు, "మీరు మమ్మల్ని తోడేళ్ళ ముందు విసిరేసారు". అల్లర్లు, హింసతో ఏమీ సాధించలేమని, శాంతి, సౌభ్రాతృత్వాలతో సంపాదించింది శాశ్వతంగా మిగిలి పోతుందని పిలుపు నిచ్చాడు. ఇటు బ్రిటీష్ ఇండియాలో, అటు పాకిస్థాన్‌లో 27 ఏళ్లపాటు జైలు జీవితాన్ని అనుభవించిన సరిహద్దు గాంధీ అఫ్గానిస్థాన్‌లోని కాబూల్ నగరానికి వెళ్లి ప్రవాస జీవితం గడిపాడు. 1969లో మహాత్మాగాంధీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా గఫర్ ఖాన్ భారత్‌కు వచ్చాడు. ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఢిల్లీకి వచ్చి అంతర్జాతీయ అవగాహన కింద ఇచ్చే 'జవహర్ లాల్ నెహ్రూ అవార్డు' అందుకున్నాడు. పార్లమెంట్ సంయుక్త సమావేశంలో మాట్లాడుతూ 'మీరు బుద్ధుడిని మరచి పోయినట్లు గానే గాంధీని మరచి పోతున్నారు' అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. తుది శ్వాస విడిచేంత వరకు నమ్ముకున్న సిద్ధాంతానికే కట్టుబడి జీవించిన గఫర్ ఖాన్ పాకిస్థాన్‌లోని పెషావర్‌లో 1988, జనవరి 20వ తేదీన ఆయన మరణించారు.

# తెల్లజుట్టు సమస్యకు వంటింటి చిట్కా



జుట్టు తెల్లబడటం అనేది నేటి కాలంలో వయసుతో సంబంధం లేకుండా చాలా మందిని బాధిస్తున్న ఒక సాధారణ సమస్య. మార్కెట్లో లభించే రసాయనాలతో కూడిన ఉత్పత్తులు తాత్కాలిక ఉపశమనాన్ని ఇస్తున్నప్పటికీ, వాటి దీర్ఘకాలిక ప్రభావాల గురించి ఆందోళనలు ఉన్నాయి. అయితే, ఈ సమస్యకు మన వంటింట్లోనే ఒక అద్భుతమైన మరియు సహజసిద్ధమైన పరిష్కారం ఉందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అదే, సొరకాయ ఉపయోగించి తయారుచేసే ప్రత్యేకమైన నూనె. ఈ పురాతన చిట్కా జుట్టుకు పోషణనిచ్చి, దాని సహజసిద్ధమైన నలుపు రంగును తిరిగి తీసుకురావడానికి సహాయపడుతుంది. జుట్టు నల్లబడటానికి సొరకాయ నూనెను తయారుచేసే పద్ధతి చాలా సులభం. ముందుగా, సొరకాయను చిన్న ముక్కలుగా కత్తిరించుకోవాలి. ఈ ముక్కలను కనీసం వారం రోజుల పాటు బాగా ఎండబెట్టుకోవాలి. ఈ ప్రక్రియ వల్ల సొరకాయలోని తేమ పూర్తిగా తొలగిపోయి, దాని పోషక విలువలు నూనెలోకి చేరడానికి సిద్ధమవుతాయి. ఇలా ఎండిన ముక్కలను ఒక మందపాటి పాత్రలో తీసుకోవాలి. తరువాత, ఈ ఎండిన సొరకాయ ముక్కలకు సరిపడా మంచి నాణ్యత గల కొబ్బరి నూనెను (ఎఱతీస్త్రఱఅ జశీఎశీఅబ్ ాఱశ్రీను వాడటం ఉత్తమం) జోడించాలి. ఈ మిశ్రమాన్ని మంటపై ఉంచి, సొరకాయ ముక్కలు రంగు మారే వరకు లేదా ముక్కలు పూర్తిగా నూనెలో కలిసిపోయినట్లు అయ్యే వరకు తక్కువ మంటపై బాగా మరిగించాలి. ఇలా మరిగించడం వల్ల సొరకాయలోని కీలకమైన పోషకాలు మరియు సహజ వర్ణకాలు నూనెలోకి పూర్తిగా విడుదలవుతాయి. అనంతరం, ఆ నూనెను చల్లార్చి, ఒక శుభ్రమైన వడపోత గుడ్డ సహాయంతో వడబోసి, గాలి చొరబడని గాజు సీసాలో నిల్వ చేసుకోవాలి. ఈ ఇంట్లో తయారుచేసిన సొరకాయ నూనెను వారానికి కనీసం ఒకసారి తలకు పట్టించి, వేళ్ళతో సున్నితంగా మసాజ్ చేసుకోవాలి. రాత్రంతా ఉంచి, మరుసటి రోజు ఉదయం మైల్డ్ షాంపూతో తలస్నానం చేయడం వల్ల ఉత్తమ ఫలితం ఉంటుంది. ఇలా తరచుగా చేయడం వలన జుట్టు కుదుళ్ళు బలం

పుంజుకుంటాయి, జుట్టు నల్లబడటం ప్రారంభమవుతుంది. రసాయనాలు లేని ఈ సహజసిద్ధమైన చికిత్స జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, తెల్లజుట్టు సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారాన్ని చూపడంలో సహాయపడుతుంది.

# పాదాల తిమ్మిర్లు ఉంటే అనారోగ్యానికి సంకేతం



పాదాల వాపులు వస్తున్నాయంటే తప్పనిసరిగా జాగ్రత్తపడాల్సి ఉంటుంది. నిజానికి చాలా మంది ఈ లక్షణాలను పెద్దగా పట్టించుకోరు. వాపులు, తిమ్మిర్లు తగ్గడానికి తాత్కాలికంగా మందులు వేసుకుని అక్కడితో వదిలేస్తారు. కానీ ఈ చిన్న సమస్యలే చాలా పెద్ద ముప్పుగా మారే ప్రమాదం ఉంటుంది. అందుకే..వీలైనంత త్వరగా స్పందించాలి. మరి ఇలా పాదాల్లో జరిగే మార్పులు ఏయే రోగాలకు సంకేతాలు.

పాదాల ఆరోగ్యాన్ని చాలా మంది పట్టించుకోరు. నిర్లక్ష్యం చేస్తుంటారు. కానీ ఇవే క్రమంగా పెద్దవై ముప్పు తెచ్చి పెడతాయి. చర్మం రంగు మారడం నుంచి తిమ్మిర్లు ఎక్కడం వరకూ ఎన్నో రకాలుగా సమస్యలు వస్తాయి. నడిచేటప్పుడు కూడా ఈ మార్పులు స్పష్టంగా కనబడతాయి. అలాంటప్పుడే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించడం మంచిది. ఏ మాత్రం ఆలస్యం చేసినా కండీషన్ సీరియస్ అయ్యే ముప్పు ఉంటుంది. నిజానికి పాదాల్లో ఇలాంటి మార్పులు వస్తున్నాయంటే ఎన్నో తీవ్ర అనారోగ్యాలకు ఇవి సంకేతాలు కావచ్చు అని పలు అధ్యయనాలు తేల్చి చెబుతున్నాయి. ముఖ్యంగా డయాబెటిస్, గుండె సంబంధిత వ్యాధుల లక్షణాలు ఇదే విధంగా ఉంటాయి. పాదాల్లో మంట, కురుపులు రావడం లాంటి లక్షణాలు రక్త సరఫరా సరిగ్గా లేనప్పుడు కనబడతాయి. ముఖ్యంగా నరాలు డ్యామేజ్ అయినప్పుడు కూడా పాదాల్లో ఇలాంటి మార్పులు కనిపించే అవకాశాలున్నాయి. ఇలాంటప్పుడు గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

పాదాల్లో ఉష్ణోగ్రతల్లో మార్పులు వచ్చినప్పుడు కూడా రంగు మారేందుకు అవకాశం ఉంటుంది. ముఖ్యంగా వాపులను మాత్రం తప్పనిసరిగా గమనించాలి. ధమనుల్లో కొవ్వు పేరుకుపోయినప్పుడు, వీటి ఆరోగ్యం సరిగ్గా లేనప్పుడు ఇలా పాదాల్లో వాపులు వస్తాయి. సరైన సమయానికి సరైన వైద్యం అందించకపోతే తీవ్ర సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. తరచూ తిమ్మిరిగా ఉండడం, దురద లాంటి లక్షణాలు కనిపించాయంటే అది డయాబెటిస్ లక్షణం కావచ్చు. లేదా నరం డ్యామేజ్ అయినప్పుడు కూడా ఇలాంటి లక్షణాలే కనిపిస్తాయి. బ్లడ్ షుగర్ లెవెల్స్ అసలు కంట్రోల్ లో లేనప్పుడు ఇలా జరుగుతుంది. నరాలు ఒత్తిడికి గురైనప్పుడు లేదా ఇంకేదైనా న్యూరో సమస్యలు తలెత్తినప్పుడు ఇలా పాదాల్లో తిమ్మిర్లు

వచ్చే అవకాశం ఉంటుంది. అయితే..ఇలాంటి లక్షణాలు కనిపించినప్పుడు చాలా త్వరగా స్పందించాల్సి ఉంటుంది. లేదంటే ఈ సమస్య కాస్త తీవ్ర ఇన్ఫెక్షన్ కి దారి తీసే ప్రమాదం ఉంది. పాదాల్లో విపరీతమైన నొప్పి, వాపులు వస్తుంటాయి. పాదాలు చాలా బరువెక్కినట్టుగా అనిపిస్తాయి. ఇలాంటి లక్షణాలు కనిపించాయంటే గుండె సంబంధిత సమస్యలు ఉన్నట్టు లెక్క. దీన్నే ఎడిమా అంటారు. ముఖ్యంగా హార్ట్ ఫెయిల్యూర్ కండీషన్స్ లో ఈ సమస్య తలెత్తుతుంది. గుండె కండరాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నా ఇలాగే పాదాల్లో వాపులు కనిపిస్తాయి. పాదాల్లో ఎక్కువగా కదలికలు వచ్చే కొద్దీ ఈ వాపులు ఎక్కువవుతుంటాయి. ఎక్కువ సమయం పాటు నిలబడినా, ఎక్కువ సేపు కూర్చున్నా వాపులు మరీ ఎక్కువవుతాయి. ఇలాంటి సమయంలో సరైన చికిత్స తీసుకోకపోతే లక్షణాలు మరీ తీవ్రమవుతాయి. పాదాలపై చర్మం పొడిగా మారడం, చర్మం రంగు మారిపోవడం లాంటి లక్షణాలు కనబడతాయి. ఏదైనా గాయం అయినప్పుడు ఎక్కువ రోజుల పాటు మానకుండా అలాగే ఉన్నా అది డయాబెటిస్ లక్షణం కావచ్చు. కొన్ని సార్లు ఈ అల్సర్స్ చాలా తీవ్రమవుతాయి. త్వరగా చికిత్స తీసుకుంటే ఇబ్బంది లేకుండా ఉంటుంది.

# శక్తి తరగకుండా ఉండాలంటే ఈ డైట్ పాటించండి!



నలభై ఏళ్లు దాటిన మహిళల శరీరంలో అనేక ముఖ్యమైన మార్పులు చోటు చేసుకుంటాయి. హార్మోన్ల సమతుల్యతలో మార్పులు, జీవక్రియ (మెటబాలిజం) మందగించడం, ఎముకల సాంద్రత తగ్గడం వంటి కారణాల వల్ల గతంలో ఉన్నంత ఉత్సాహం, శక్తి తరచుగా తగ్గిపోతుంటాయి. ఎంత సమయానికి తింటున్నా కొన్నిసార్లు నీరసం, అలసట చుట్టుముట్టవచ్చు. ఈ దశలో, కేవలం ఆహారం తీసుకోవడం సరిపోదు. శరీరానికి తగిన పోషకాలు అంది, శక్తిని కాపాడుకోవడానికి సమతుల్యమైన (బ్యాలెన్స్‌డ్) ఆహార విధానాన్ని అనుసరించడం చాలా ముఖ్యం. నిపుణులు కూడా దీనినే గట్టిగా సూచిస్తున్నారు. శరీరానికి అవసరమైన అన్ని రకాల విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా అందాలంటే, ఆహారంలో తాజా పండ్లు, కూరగాయలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. వివిధ రంగుల్లో ఉండే పండ్లు, ఆకుకూరలు యాంటీఆక్సిడెంట్లను అందించి కణాల ఆరోగ్యాన్ని కాపాడతాయి. ముఖ్యంగా, ఎముకల బలం కోసం కాల్షియం, విటమిన్ డి అవసరం. వీటితో పాటు రక్తహీనతను నివారించేందుకు ఐరన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలను కూడా డైట్‌లో చేర్చుకోవాలి. ఈ పవర్‌హౌస్ లాంటి ఆహారాలు రోగనిరోధక శక్తిని పెంచడానికి, దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడతాయి. 40 ఏళ్లు పైబడిన తర్వాత, కండరాల క్షీణతను నివారించడానికి ప్రోటీన్ ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం తప్పనిసరి. అందుకే, ఆహారంలో పాల ఉత్పత్తులు (పాలు, పెరుగు, పన్నీర్), అలాగే మాంసాహారం, గుడ్లు వంటి వాటిని తగిన మోతాదులో చేర్చుకోవాలి. పాల ఉత్పత్తులు కాల్షియంను అందిస్తే, మాంసాహారం, గుడ్లు నాణ్యమైన ప్రోటీన్‌ను అందిస్తాయి. శాఖాహారులు పప్పులు, చిక్కుళ్లు, సోయా వంటి వాటిని తీసుకోవడం ద్వారా ప్రోటీన్ అవసరాలను తీర్చుకోవచ్చు. ఈ కీలకమైన పోషకాలు శరీరాన్ని దృఢంగా ఉంచి, రోజంతా శక్తివంతంగా ఉండేలా చేస్తాయి. శక్తి స్థాయిలను మెరుగుపరచుకోవడానికి, జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి పీచు పదార్థాలు (ఫైబర్) ఉన్న ఆహారాన్ని డైట్‌లో పెంచాలి. తృణధాన్యాలు, పప్పులు, కూరగాయలలో పీచు పదార్థాలు అధికంగా ఉంటాయి. ఇవి మలబద్ధకాన్ని నివారిస్తాయి. అన్నిటికంటే ముఖ్యంగా, ఎంత మంచి ఆహారం తీసుకున్నా, శరీరం హైడ్రేటెడ్‌గా (సరిపడా నీటితో) ఉండటం చాలా అవసరం. అందుకే, తరచుగా, సరిపడా నీటిని తాగాలి. తగినంత నీరు తాగడం వల్ల నీరసం తగ్గుతుంది, జీవక్రియ సక్రమంగా పనిచేస్తుంది. ఈ మార్పులను పాటించడం ద్వారా 40 ప్లస్ మహిళలు ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉండగలుగుతారు.

# డబ్ల్యూపీఎల్ 2026 ఛాంపియన్ ఆర్సీబీ.. బెంగళూరు ఖాతాలో రెండో టైటిల్



ఐపీఎల్ టైటిల్ గెలవడానికి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పురుషుల జట్టుకు 18 ఏళ్లు పట్టింది. కానీ ఆర్సీబీ మహిళల జట్టు రెండేళ్ల వ్యవధిలో రెండు కప్పులు కొట్టేసింది. మహిళల ప్రిమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) మొదలైనప్పటి నుంచి పట్టువదలకుండా ఫైనల్ చేరుతున్న దిల్లీ క్యాపిటల్స్‌కు మరోసారి నిరాశనే మిగులుస్తూ ట్రోఫీ పట్టుకుపోయింది. కెప్టెన్ స్మృతి మంధాన, జార్జియా వోల్ మామూలుగా విరుచుకుపడలేదు. ఈ జంట ఎడాపెడా బౌండరీల మోతతో విధ్వంసం సృష్టించడంతో కొండంత లక్ష్యాన్ని ఛేదించేసింది ఆర్సీబీ దిల్లీ ఆఖర్లో బంతితో పుంజుకోవడంతో ఆట ఉత్కంఠభరింగా మారినా చివరికి ఆర్సీబీదే పైచేయి అయింది. బెంగళూరు ఇంతకుముందు 2024లో విజేతగా నిలిచింది. పాపం దిల్లీ. వరుసగా నాలుగు ఫైనళ్లు ఓడడాన్ని జీర్ణించుకోవడం ఆ జట్టుకు కష్టమే.

భారీ స్కోర్ల మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుదే పైచేయి. స్మృతి మంధాన (87; 41 బంతుల్లో 12ఐ4, 3ఐ6), జార్జియా వోల్ (79; 54 బంతుల్లో 14ఐ4) వీరవిహారం చేయడంతో గురువారం డబ్ల్యూపీఎల్-4 ఫైనల్లో ఆర్సీబీ 6 వికెట్ల తేడాతో దిల్లీ క్యాపిటల్స్‌పై విజయం సాధించింది. జెమీమా (57; 37 బంతుల్లో 8ఐ4), లారా వోల్వార్ట్ (44; 25 బంతుల్లో 3ఐ4, 2ఐ6) మెరవడంతో మొదట దిల్లీ 4 వికెటకు 203 పరుగులు చేసింది. లిజెలి (37; 30 బంతుల్లో 3ఐ4, 3ఐ6) షినెలి (35 నాటౌట్; 15 బంతుల్లో 4ఐ4, 2ఐ6) కూడా మెరిశారు. స్మృతి, వోల్ జంట రెండో వికెట్‌కు 92 బంతుల్లో 165 పరుగులు జోడించడంతో లక్ష్యాన్ని బెంగళూరు 19.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది .

ఆ ఇద్దరి విధ్వంసం: టీ20ల్లో రెండొందలపై లక్ష్యాన్ని ఛేదించడం ఎప్పుడైనా, ఎక్కడైనా ఎంతో కష్టమే. ఫైనల్ అయితే ఇంకా ఒత్తిడి ఉంటుంది. కానీ కెప్టెన్ స్మృతి మంధాన, జార్జియా వోల్‌ల నిర్దాక్షిణ్య విధ్వంసంతో 204 పరుగుల లక్ష్యాన్ని బెంగళూరు ఛేదించేసింది. నిజానికి రెండో ఓవర్లోనే ప్రమాదకర గ్రేస్ హారిస్ (9)ను ఔట్ చేయడం ద్వారా ఆర్సీబీని ఒత్తిడిలోకి నెట్టేట్లే కనిపించింది దిల్లీ. కానీ ఆ జట్టు సంతోషం ఎంతో సేపు నిలవలేదు. మరో ఓపెనర్ స్మృతి, జార్జియా వోల్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. దిల్లీ బౌలింగ్‌ను తుత్తునియులు చేస్తూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఏ బౌలర్‌నూ వదల్లేదు. షినెలి, కాప్ ఓవర్లలో వోల్ రెండేసి ఫోర్లు బాదేస్తే.. నందని బౌలింగ్‌లో స్మృతి వరుసగా 4, 6 కొట్టింది. వోల్ 37 బంతుల్లో, స్మృతి 23 బంతుల్లో అర్ధశతకాలు పూర్తి చేశారు. వీరి జోరుతో 12 ఓవర్లలో 124/1తో నిలిచింది ఆర్సీబీ. ఆ తర్వాత కూడా ఇద్దరి జోరు కొనసాగింది. ముఖ్యంగా స్మృతి ఎడాపెడా ఫోర్లు కొట్టేసింది. 16 ఓవర్లలో 169/1తో విజయం వైపు పరుగులు పెట్టింది ఆర్సీబీ. ఈ జట్టు గెలుపు ఇక తేలికే అనిపించింది. కానీ దిల్లీ పుంజుకోవడంతో ఆఖర్లో డ్రామా తప్పలేదు.

ఆఖర్లో ఇలా..: సాఫీగా లక్ష్యం దిశగా సాగుతున్న ఆర్సీబీ.. ఆఖర్లో ఒత్తిడికి గురైంది. 17వ ఓవర్లో వోల్‌ను ఔట్ చేయడం ద్వారా మ్యాచ్‌ను కాస్త ఆసక్తికరంగా మార్చింది మిన్ను మణి. ఆ తర్వాతి పరిణామాలతో క్లైమాక్స్.. అనూహ్యంగా రసవత్తరంగా మారింది. ఆఖరి మూడు ఓవర్లలో ఆర్సీబీకి 27 పరుగులు అవసరం కాగా.. 18వ ఓవర్లో 9 పరుగులే ఇచ్చిన నందని, రిచా (6)ను ఔట్ చేసింది. తర్వాతి ఓవర్లో షినెలి.. 8 పరుగులే ఇచ్చి ప్రమాదకర స్మృతిని వెనక్కి పంపింది. చివరి ఓవర్లో ఆర్సీబీకి 10 పరుగులు అవసరం కావడంతో ఉత్కంఠ తీవ్రమైంది. శ్రీచరణి బౌలింగ్‌లో తొలి రెండు బంతులకు 2 పరుగులు వచ్చాయి. కానీ ఆ తర్వాత కవర్ మీదుగా వరుసగా రెండు బౌండరీలు బాదిన రాధ యాదవ్ (12 నాటౌట్) ఆర్సీబీని సంబరాల్లో ముంచెత్తింది. 19వ ఓవర్లో, స్మృతి ఔటైన వెంటనే, రాధ ఇచ్చిన ఓ తేలికైన క్యాచ్‌ను మిన్ను మణి జారవిడిచి ఉండకపోతే మ్యాచ్ ఫలితం భిన్నంగా ఉండేదేమో! ఆ తప్పిదానికి రెండు పరుగులు కూడా వచ్చాయి.

జెమీమా ధనాధన్: దిల్లీ అంతకుముందు అదరగొట్టింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆ జట్టుకు తొలి మూడు ఓవర్లలో 9 పరుగులే రాగా.. ఆ తర్వాత ఓపెనర్లు లిజెలి లీ, షెఫాలి వర్మ బ్యాట్లు ఝుళిపించారు. ఆరో ఓవర్లో షెఫాలి వెనుదిరిగేటప్పటికి స్కోరు 49. లిజెలి వరుసగా 4, 4, 6.. వోల్వార్ట్ ఓ ఫోర్ బాదడంతో ఏడో ఓవర్లో శ్రేయాంక 19 పరుగులు సమర్పించుకుంది. జోరుమీదున్న లిజెలిని నదైన్ ఔట్ చేసినా.. ఆర్సీబీకి సంతోషించడానికేమీ లేకపోయింది. ఆమె స్థానంలో వచ్చిన జెమీమా చెలరేగిపోయింది. మరోవైపు వోల్వార్ట్ నిలవగా.. చకచకా బౌండరీలు బాదేస్తూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. 16వ ఓవర్లో జెమీమా నిష్క్రమణ తర్వాత స్కోరు వేగం పెరిగిందే తప్ప తగ్గలేదు. వోల్వార్ట్, షినెలి హెన్రీ విరుచుకుపడడంతో ఆఖరి మూడు ఓవర్లలో దిల్లీ 49 పరుగులు రాబట్టింది.

దిల్లీ ఇన్నింగ్స్: లిజెలి లీ (సి) గ్రేస్ హారిస్ (బి) నదైన్ డిక్లెర్క్ 37; షెఫాలి వర్మ (సి) రిచా (బి) అరుంధతి రెడ్డి 20; లారా వోల్వార్ట్ రనౌట్ 44; జెమీమా (సి) నదైన్ డిక్లెర్క్ (బి) సయాలి 57; షినెలి హెన్రీ నాటౌట్ 35; ఎక్స్‌ట్రాలు 10 మొత్తం: (20 ఓవర్లలో 4 వికెట్లకు) 203; వికెట్ల పతనం: 1-49, 2-72, 3-148, 4-203; బౌలింగ్: లారెన్ బెల్ 4-0-19-0; సయాలి 4-0-46-1; అరుంధతి రెడ్డి 4-0-40-1; శ్రేయాంక పాటిల్ 2-0-32-0; నదైన్ డిక్లెర్క్ 4-0-48-1; రాధ యాదవ్ 2-0-18-0

బెంగళూరు ఇన్నింగ్స్: గ్రేస్ హారిస్ (బి) హెన్రీ 9; స్మృతి మంధాన (బి) హెన్రీ 87; జార్జియా వోల్ (సి) షెఫాలి వర్మ (బి) మిన్ను మణి 79; రిచా ఘోష్ (సి) మిన్ను మణి (బి) నందని శర్మ 6; డిక్లెర్క్ నాటౌట్ 7; రాధ నాటౌట్ 12; ఎక్స్‌ట్రాలు 4 మొత్తం: (19.4 ఓవర్లలో 4 వికెట్లకు) 204; వికెట్ల పతనం: 1-9, 2-174, 3-181, 4-191; బౌలింగ్: మరిజేన్ కాప్ 4-0-38-0; షినెలి హెన్రీ 4-0-34-2; నందని శర్మ 4-0-41-1; శ్రీచరణి 3.4-0-46-0; షెఫాలి వర్మ 1-0-9-0; మిన్ను మణి 2-0-19-1; స్నేహ్ రాణా 1-0-15-0

# పర్సనల్ ర్యాంకింగ్స్‌లో టాప్ బెస్ట్ మూవీస్ ఇవే!



2025 లో చాలా వరకు క్రేజీ సినిమాలు, భారీ బడ్జెట్ మూవీస్‌తో పాటు కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలు, బడ్జెట్ చిత్రాలు దేశ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకొచ్చాయి. అందులో కొన్ని సూపర్ హిట్‌లుగా నిలిస్తే మరికొన్ని పరాజయాల్ని చవిచూశాయి. ఓవరాల్‌గా అత్యధిక శాతం సినిమాలు నిరాశపరిచినా కొన్ని సినిమాలు మాత్రం హార్ట్ ని టచ్ చేశాయి. భారీ వసూళ్లని రాబట్టి బాక్సాఫీస్ ని షేక్ చేశాయి. వ్యక్తిగత ర్యాంకింగ్స్‌లో టాప్ బెస్ట్ మూవీస్‌గా నిలిచాయి. బాలీవుడ్‌లో జాన్ అబ్రహం, సాదియా ఖతీబ్ ప్రధాన పాత్రల్లో నటించిన మూవీ -ది డిప్లొమాట్-. శివం నాయర్ దర్శకత్వం వహించారు. బలవంతపు వివాహం తరువాత పాకిస్థాన్‌లో చిక్కుకున్న భారతీయ మహిళ ఉజ్మా అహ్మద్ జీవిత కథ ఆధారంగా ఈ మూవీని రూపొందించారు. ఇదొక పొలిటికల్ థ్రిల్లర్ డ్రామా. పాక్‌లో చిక్కుకున్న మహిళ ఉజ్మా అహ్మద్‌ని దౌత్యవేత్త జెపీ సింగ్ ఎలా ఆమెకు అండగా నిలిచాడు. తనని రక్షించి ఎలా ఇండియాకు తిరిగి తీసుకొచ్చాడనే కథతో రూపొందిన సినిమా ఇది. రియల్ లైఫ్ ఎమోషనల్ డ్రామాగా ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. రిషబ్‌శెట్టి కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో రూపొందిన కన్నడ మూవీ -కాంతార చాప్టర్ 1-.తొలి భాగం సైలెంట్‌గా విడుదలై ఐదు భాషల్లో సంచలనం సృష్టించడం, బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లని రాబట్టడంతో ప్రీక్వెల్‌గా వచ్చిన -కాంతార చాప్టర్ 1-పై అంచనాలు తారా స్థాయికి చేరుకున్నాయి. ఫస్ట్ పార్ట్‌కు మించి గ్రాండ్ స్కేల్ మేకింగ్, అబ్బుర పరిచే సన్నివేశాలు, షాకింగ్ క్లైమాక్స్‌తో సినిమా టాక్ ఆఫ్ ది ఇండియాగా మారింది. డివోషనల్ టచ్‌తో పీరియాడిక్ ఫీల్‌ని కలిగించడంతో ప్రతీ ఒక్కరు ఈ మూవీని లైక్ చేశారు.స్టోలెన్ హిందీతో రూపొందిన ఓ సర్వైవల్ థ్రిల్లర్. దీనికి కరణ్ తేజ్ పాల్ దర్శకత్వం వహించాడు. అభిషేక్ బెనర్జీ కీలక పాత్రలో నటించాడు. ఇద్దరు సోదరులు చిన్న పిల్లల కిడ్నాప్ వ్యవహారంలో చిక్కుకోవడంతో వారి జీవితాల్లో పెను సవాళ్లు ఎదురవుతాయి. దాని నుంచి వారు ఎలా బయటపడ్డారు అన్నదే ఈ మూవీ అసలు కథ. రియల్ ఇన్సి డెంట్స్‌ని స్ఫూర్తిగా తీసుకుని చేసిన మూవీ ఆసక్తికరమైన మలుపులతో సాగుతూ సగటుప్రేక్షకుడిని వెంటాడుతుంది. ఇదే తరహాలో క్రైమ్ స్టోరీ నేపథ్యంలో సాగే కోర్ట్ డ్రామాగా తెరకెక్కిన మూవీ -కోర్ట్-. నేచురల్ స్టార్ నాని దీన్ని నిర్మించాడు. శివాజీ, రోహిణి, శుభలేఖ సుధాకర్ మినహా అంతా కొత్త వారితో చేసిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి విజయాన్ని సొంతం చేసుకుంది. ఒక ప్రేమ జంటని విడదీయడం కోసం పోక్సో చట్టంతో అమ్మాయి బంధువు ఆడిన గేమ్ నేపథ్యంలో ఈ సినిమాని ఆద్యంతం ఆసక్తికరంగా తెరకెక్కించారు. అత్యంత తక్కువ బడ్జెట్‌తో చేసిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ. 50 కోట్ల మేర వసూళ్లని రాబట్టిందంటే ఏ స్థాయిలో ప్రేక్షకుల్లో అటెన్షన్‌ని క్రియేట్ చేసిందో అర్థం చేసుకోవచ్చు.ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షూట్, చైనీస్ యానిమేషన్ మూవీ నే ఝా 2, హాలీవుడ్ హీరో బ్రాడ్ పీట్ నటించిన ఎఫ్1 స్పోర్ట్స్ డ్రామా, గ్రాఫిక్స్ ప్రధానంగా సాగిన డివోషనల్ యానిమేషన్ మూవీ, యంగేజ్ లవ్ డ్రామా లిటిల్ హార్ట్స్, స్పై యాక్షన్ థ్రిల్లర్ సినిమాల్లో సరికొత్త చరిత్ర సృష్టిస్తున్న -ధురంధర్- ఈ ఏడాది విడుదలైన సినిమాల్లో పర్సనల్ ర్యాంకింగ్స్‌లో టాప్‌లో నిలిచాయి. ఇక కేసరి చాప్టర్ 2, చావా, కుబేర, రైడ్ 2, కాల్, ఎలవన్ చిత్రాలు కూడా మంచి ఇంపాక్ట్‌ని కలిగించాయి.



ప్రియాంక ఖోల్గాడే వైట్ ఫ్లోరల్ డ్రెస్‌లో అద్భుతంగా ఉంది

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com